ప్రజాశక్తి

బుధవారం 31 మే 2023 8 పేజీలు





ఎన్‌టిఆర్ కృష్ణా

ఖరీఫ్ ప్రణాళిక

అరకొరగానే రాయితీ విత్తనాలు



ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

మరో 10 రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాబోతోంది. వేసవిలో కురుస్తున్న అకాల వర్షాలతో వ్యవసాయ భూములు దుక్కులకు అనువుగా మారాయి. నారుమళ్లు పోసుకునేందుకు వీలుగా దుక్కులు దున్ని రైతులు తమ పొలాను సిద్ధం చేసుకుంటున్నారు. ఈనేపథ్యంలోనే 2023-24 ఖరీఫ్ సీజన్లో పంటల సాగుకు సంబంధించిన వ్యవసాయ శాఖ ప్రణాళికను ప్రభుత్వం సిద్ధం చేసింది. కానీ కృష్ణాజిల్లాకు నామమాత్రంగానే రాయితీ విత్తనాలను కేటాయించింది. దీంతో అధిక సంఖ్యలో రైతులు వరి విత్తనాల కోసం ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ సీజన్లో 4 లక్షల 55 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. దీనిలో అత్యధికంగా 4 లక్షల 30 వేల ఎకరాల్లో వరి సాగవుతుంది. ఎకరం సాగుకు సగటున 25 కిలోల విత్తనాలు అవసరం అవుతాయి. ఈ లెక్కన జిల్లాకు మొత్తం లక్షా 7 వేల 500 క్వింటాళ్ల వరి విత్తనాలు కావాలి. అయితే ప్రభుత్వం కేవలం 6,690 క్వింటాళ్లు మాత్రమే కేటాయించింది. దీంతో లక్షా 810 క్వింటాళ్ల విత్తనాలను రైతులు బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం రెండు రకాల వెరైటీలకు సంబంధించి వరి విత్తనాలను మాత్రమే ప్రభుత్వం రాయితీపై అందిస్తోంది. బిపిటి 5204 విత్తనాలకు క్వింటా ధర రూ.3,850గా, ఎంటియు 1061 విత్తనాలకు క్వింటాకు రూ.3800గా ప్రభుత్వం ధర నిర్ణయిచింది. కిలోకు రూ.5 చొప్పున క్వింటాకు రూ.500 రాయితీ ఇవ్వనుంది. రాయితీ విత్తనాలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేయించుకోవాలి. సాగు విస్తీర్ణం, రైతుకు విత్తన కేటాయింపులు, దీనికి సంబంధించి రైతులు చెల్లించాల్సిన నగదు తదితర వివరాలను రైతులు ఇస్తే వారి సెల్‌ఫోన్‌కు ఒటిపి వస్తుంది. దీని ఆధారంగా నగదు జమ చేసిన అనంతరం రైతులకు విత్తనాలు అందిస్తారు.

నిర్మల్ హృదయ్‌ను సందర్శించిన సిఎం దంపతులు



వార్త మెయిన్‌లో

రాఘవయ్య పార్కు సమీపంలోని నిర్మల హృదయ్ భవన్లో చిన్నారిని ముద్దాడుతున్న సిఎం వై.ఎస్.జగన్మోహనరెడ్డి, అనాథ పిల్లలతో ముచ్చటిస్తున్న జగన్ దంపతులు (అంతర్‌చిత్రంలో)



వార్త 2లో

సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నేత సిహెచ్.బాబూరావు

సుందరయ్యకు ఘన నివాళి



వార్త 8లో

విజయవాడ లెనిన్ సెంటర్లో నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాలు

మహిళా రెజ్లర్ల అక్రమ అరెస్టులపై నిరసన



మీడియాతో మాట్లాడుతున్న డి.కాశీనాథ్, చిత్రంలో సత్యబాబు

సమస్యల్లో ప్రజలు...విహార యాత్రల్లో కార్పొరేటర్లు

సిపిఎం రాష్ట్ర నాయకులు దోనేపూడి కాశీనాథ్

ప్రజాశక్తి - విజయవాడ : నగర కార్పొరేటర్లు విజ్ఞాన యాత్రల పేరుతో విహార యాత్రలు చేస్తున్నారని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ విమర్శించారు. ప్రజా సమస్యలను పూర్తిగా గాలికొదిలేసి రూ.50 లక్షల ప్రజాధనాన్ని మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేస్తున్నారని అన్నారు. ఇటువంటి చర్యను నగర ప్రజలు సహించరని, తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. గవర్నర్‌పేటలోని శ్రీశ్రీ భవన్‌లో మంగళవారం ఆ పార్టీ ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో అధికార వైసిపి ప్రజాప్రతినిధులు

(మిగతా 6లో)

విత్తనాలు సిద్ధం చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ

రానున్న ఖరీఫ్ సీజన్లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సిద్ధం చేయాలని, సేంద్రీయ పద్ధతులు, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసరించి తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించేలా రైతులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుల సమావేశాన్ని మంగళవారం ఆయన నగరంలోని తన విడిది కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈసమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 43 వేల ఎకరాల్లో వరి, మెట్టప్రాంతంలో మిరప, వేరుశనగ, కంది, పత్తిని రైతులు ఎక్కువగా సాగు చేస్తారన్నారు. వేరుశనగ, కంది, రాగులు విత్తనాలను ఆదర్శ రైతులకు ఉచితంగా, వరి సాగు రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ముందస్తు సేద్యంలో భాగంగా ఘనజీవామృతం వినియోగించడం వల్ల భూమికి మేలు చేసే సూక్ష్మ జీవులకు ఆహారం లభించి అవి ఇబ్బడిముబ్బడిగా వృద్ధి చెందుతాయన్నారు. సూక్ష్మ జీవులు అభివృద్ధి చెందడం ద్వారా పోషకాలను మొక్కల వేర్లకు అందుబాటులో తీసుకువస్తాయన్నారు. తృణధాన్యాలు, అపరాలు, నూనె గింజలు, వెదజల్లి సూక్ష్మ జీవులను అభివృద్ధి చేసుకునేలా రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. జొన్నలు, రాగులు, కొర్రలు, సజ్జలు, పెసలు, శనగలు, మినువులు, నువ్వులు, ఆవాలు, జీలుగ, కట్టె జనుము, పిల్లిపెసర, బెండ, గోరుచిక్కుడు తదితర పంటలను చేపట్టడం వల్ల భూమి ఎంతో సారవంం అవుతుందన్నారు.




ఐతవరంలో అభివృద్ధి కార్యక్రమాలు

ప్రజాశక్తి-నందిగామ: ఐతవరం గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, రైతు భరోసా కేంద్ర భవనాన్ని, వైయస్సార్ విలేజ్ క్లినిక్ భవనాన్ని రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మొండితోక జగన్మోహన్‌రావు, వసంత వెంకట కృష్ణప్రసాద్, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, మొండితోక అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అతిథులను మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ సత్కరించి వారికి జ్ఞాపికలను అందజేశారు.

శ్రీవాహిని అధ్యాపకునికి అంతర్జాతీయ సర్టిఫికెట్

ప్రజాశక్తి-తిరువూరు: స్థానిక శ్రీవాహిని పాలిటెక్నిక్ కళాశాల మెకానికల్ విభాగానికి చెందిన అధ్యాపకులు వెంకటసాయి యశ్వంత్ మోహన్ అంతర్జాతీయ సర్టిఫికెట్ లభించింది. ప్రముఖ అంతర్జాతీయ సంస్థ దస్సాల్ట్ సిస్టమ్స్ వారిచే మెకానికల్ డిజైన్ విభాగంలో సాలిడ్ వర్క్స్ లో వెంకటసాయి యశ్వంత్ మోహన్ సర్టిఫికేషన్ పూర్తి చేసినందుకు ఈసర్టిఫి కెట్ వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రంగా నాగేంద్రబాబు తెలిపారు. అతి చిన్న వయసులోనే అంతర్జాతీయ సర్టిఫికేషన్ పొందడం పట్ల యశ్వంత్ ని కళాశాల చైర్మన్ పసుమర్తి వెంకటే శ్వరరావు, సెక్రెటరీ ఊటుకూరి సుబ్రహ్మణ్యం, కరెస్పాండెంట్ పోట్రు నాగేశ్వ రరావు, కోశాధికారి ముత్యాల కిషోర్‌బాబు అభినందించారు.



సిబిఎస్ఇ పరీక్షల్లో శ్రీప్రదకు ప్రథమ స్థానం

ప్రజాశక్తి-భవానీపురం : సీబీఎస్ఈ నిర్వహించిన 10వ తరగతి 2022-2023 సంవత్సరాంతర పరీక్షలలో వన్‌టౌన్ లో ఉన్న ఎట్కిన్సన్ సీనియర్ సెకండరీ స్కూల్ విద్యార్థిని భవానీపురం హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన శ్రీ ప్రద పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ మారియెట్టా డి' మెల్లో, ప్రిన్సిపల్ సిస్టర్ అంతూ మేరీ విద్యార్థి శ్రీ ప్రదను అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. అత్యున్నత విద్యా ప్రమాణాలు, క్రమశిక్షణ, సమగ్రమైన అభ్యున్నతికి కృషి చేస్తున్న ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులను అభినందించారు.





మాట్లాడుతున్న కె.శ్రీదేవి

సుందరయ్యకు నివాళి

ప్రజాశక్తి-సింగ్‌నగర్: భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రకాష్ నగర్ సెంటర్లో బహిరంగ సభ నిర్వహించారు. ముందుగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి సభ్యులు దుర్గారావు అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ నేడు అధికారంలో ఉన్న బిజెపి, వైసిపి ప్రభుత్వాలు ప్రజలపై భారాలు వేస్తూ వారి ఆదాయానికి గండి కొడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, కె.శ్రీదేవి, సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణారావు, నగర కమిటీ సభ్యులు సిహెచ్ శ్రీనివాస్, జి.ఝాన్సీ రాణి, ఎస్.కె పీరు సాహెబ్, జి. సుజాత, కార్యదర్శులు టి. శ్రీనివాస్, ఎస్కే నిజాముద్దీన్, ఎం. రామాంజనేయులు, పి.వెంకటరెడ్డి, పి. సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విజయవాడ దుర్గాపురంలో మాట్లాడుతున్న దుర్గారావు


బెంజిసర్కిల్ వద్ద...


కొండపల్లిలో...

హక్కుల కోసం రాజీలేని పోరాటాలు

సిఐటియు ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో నేతలు

సిఐటియు 53వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఎన్‌టిఆర్ జిల్లాలో మంగళవారం పలుచోట్ల నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు పతాకాలను ఆవిష్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ నేడు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తోన్న విధానాల వల్ల కార్మిక, ఉద్యోగ హక్కులు, చట్టాలు హరించబడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 44 చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చివేసి, కార్మికులను కట్టుబానిసలుగా చేశారన్నారు. రాష్ట్రంలో కూడా కార్మిక చట్టాలు అమలు కావడం లేదన్నారు. పని గంటలు పెంపు, వేతనాలు తగ్గింపు, పని భారం, యజమానుల వేధింపులు తదితర సమస్యల నడుమ కార్మికవర్గం పని చేయాల్సి వస్తోందన్నారు. వీటన్నింటికీ వ్యతిరేకంగా, కార్మికుల హక్కుల కోసం ఆది నుంచి నేటి వరకు కూడా సిఐటియు రాజీలేని పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. రానున్న కాలంలో జరిగే పోరాటాల్లో కార్మికవర్గం కలిసి రావాలని పిలుపునిచ్చారు.

ప్రజాశక్తి-విజయవాడ: బిఆర్‌టిఎస్ రోడ్డులోని దుర్గాపురం సిఐటియు కార్యాలయం వద్ద సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో సిఐటియు జెండావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె దుర్గారావు, ఎంవి సుధాకర్, నాయకులు టి ప్రవీణ్, ఎం బాబూరావు, ఎం శివ, వై సుబ్బారావు, టి ప్రభుదాస్, ఎం మురళి, వి మోహనాచారి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. సెంట్రల్ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రభాస్ కళాశాల ఆటో స్టాండ్ వద్ద సిఐటియు పతాకావిష్కరణ జరిగింది. అనంతరం నాయకులు, ఆటో కార్మికులు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎ వెంకటేశ్వరరావు, ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం హనుమంతరావు, నాయకులు ఎ అనిల్, షేక్ బాజి, డి కాలేశ్వరరావు, షేక్ ఫరీద్, ఎం బాష తదితరులు పాల్గొన్నారు. ఎన్‌టిఆర్ కాంప్లెక్స్ వద్ద ముఠా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి ఎం సీతారాములు జెండా విష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో నర్సింహాలు పాల్గొనగా, హాకర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మహంతిమార్కెట్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు భూలోకం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వై సుబ్బారావు, బి లక్ష్మణ, సిహెచ్ మురళి పాల్గొన్నారు. ఆర్ఆర్‌పేటలో సిఐటియు జెండా విష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం బాబూరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-విజయవాడఅర్బన్:** బెంజిసర్కిల్ వద్ద కార్మికుల అడ్డా వద్ద జరిగిన కార్యక్రమంలో కృష్ణాజిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.నరసింహారావు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ తూర్పు సిటీ అధ్యక్షులు వి.బి.రాజు, ఎం.మల్లేశ్వరరావు, దుర్గారావు, రామకృష్ణ, డి.రాంబాబు, చంటి, వెంకన్న, రాజు పాల్గొన్నారు. పటమట ఈసేవా కేంద్రం వద్ద సిఐటియు విజయవాడ తూర్పు నగర కమిటీ సభ్యులు బుచ్చిబాబు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు వి.బి.రాజు, తూర్పు సిటీ కార్యదర్శి బి.బెనర్జీ, 14వ డివిజన్ బాధ్యులు వి.గురుమూర్తి, డి.రవీంద్ర, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు పి.రాజు, వెంకటేశ్వరరావు, మాల్యాద్రి పాల్గొన్నారు. అనంతరం చిన్న వంతెన వద్ద సిఐటియు జెండాను యూనియన్ గౌరవాధ్యక్షులు ఎస్.కె.మస్తాన్ ఆవిష్కరించారు. ఆటోనగర్‌లోని ఇండస్ట్రియల్ అల్యూమినియం మెటల్ వర్క్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి ఉదయ్ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఈస్ట్ సిటీ అధ్యక్షులు వి.బి.రాజు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం:** హెచ్‌పిసియల్ ట్రక్ టెర్మినల్ యూనియన్ అధ్యక్షులు సుందర్‌రావు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మహేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పిసియల్ ట్రక్ టెర్మినల్ కార్యదర్శి సిహెచ్ బాబురావు, కోశాధికారి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు శేషగిరి నాయకులు భాస్కర్ సాంబశివరావు, బుల్లయ్య, రమేష్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు:** మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయం వద్ద కార్యదర్శి దారా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సముద్రాల వెంకట్రావు సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు తిరుపతిరావు, పార్వతి, నరసింహారావు వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-నందిగామ:** నందిగామ మునిసిపల్ ఆఫీస్ వద్ద సిఐటియు జెండాను మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సీనియర్ నాయకులు మంచాలు పిచ్చియ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నందిగామ మండల కార్యదర్శి కే గోపాల్, నాయకులు సలికేట్ నరేష్, సైదా, మాణిక్యం, పిచ్చయ్య, ప్రసాదు, బేబీ, శ్రీను, నాగరాజు, రూతమ్మ, నాతానేలు పాల్గొన్నారు.


నందిగామలో...


పెనుగంచిప్రోలులో...


తిరువూరులో...


వత్సవాయిలో...

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ కార్యాలయం వద్ద సిఐటియు పతాకాన్ని మండల కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎం.సురేష్, సిహెచ్. నాగరాజు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-వత్సవాయి:** మండల కేంద్రంలోని గాంధీ పార్క్ సెంటర్‌లో సీఐటీయ జెండాను వై.వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయు మండల కార్యదర్శి బి.రాము మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవయ్య, వెంకటేశ్వర్లు, బాబురావు, ప్రసాద్, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కెబిఎన్ విద్యార్థులు

ప్రజాశక్తి-వన్‌టౌన్: వచ్చే నెలలో ఢిల్లీలో జరిగే జూనియర్ (ఎస్‌జీఎఫ్) హ్యాండ్‌బాల్ పోటీలకు తమ కళాశాల విద్యార్థులు హాజరుకానున్నట్లు కాకరపర్తి భావనారాయణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు తలలెఇపారు. కృష్ణా విశ్వవిద్యాలయం పరిధిలో హ్యాండ్‌బాల్ పోటీల్లో తమ కళాశాల అత్యంత ప్రతిభను కనబరిచి పలు బహుమతులను అందుకుంటున్న విషయం అందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు. అదే క్రమంలో ఢిల్లీలో జరిగే పోటీలకు ఆంధ్రప్రదేశ్ పక్షాన తమ ఇంటర్మీడియట్ విద్యార్థులు అరవింద్, సత్య, శ్రవాణి హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, వారిని తీర్చిదిద్దిన ఫిజికల్ డైరెక్టర్ డీ హేమంచద్రరావులను కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు అభినందించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ టీ భాగ్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.





సత్యబాబు పర్యటన

ప్రజాశక్తి-వన్‌టౌన్ : 50వ డివిజన్‌లో కార్పొరేటర్ బోయి సత్యబాబు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా మంచినీరు సరఫరా తక్కువగా వస్తుందని స్థానిక మహిళలు తెలియజేశారు. వెంటనే మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులకు ప్రజల సమస్యను తెలియజేశారు. అలాగే పాడైన బోరు పంపును వెంటనే మరమ్మతులు చేయాలని కోరారు.

ప్రజాశక్తి
జిల్లా వార్తలు 3
బుధవారం 31 మే 2023

ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-యంత్రాంగం

కృష్ణాజిల్లాలోని మచిలీపట్నం, గుడివాడ, అవనిగడ్డ, చల్లపల్లి, బంటుమిల్లి, నాగాయలంక, బాపులపాడు మండలాల్లో సిఐటియు ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. గుడివాడ : కార్మిక, కర్షక చట్టాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ సి పి రెడ్డి అన్నారు. మంగళవారం సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిఐటియు జెండాను గుడివాడ టాటా మ్యాజిక్ స్టాండ్ లో మోటర్ క్యాబ్ డ్రైవర్ యూనియన్ అధ్యక్షుడు చేబ్రోని ఎలీషారావు ఆవిష్కరించారు. శౌంరి వెంకటేశ్వరరావు, పెయింటర్ రాము, ఐద్వా కార్యదర్శి పి.రజిని, సిఐటియు నాయకురాలు ఎండి హాఫీజా తదితరులు పాల్గొన్నారు. **నాగాయలంక :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కార్మిక ఫ్లాట్ రిక్షా యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియు ఆవిర్భావ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శాంతి థియేటర్ సమీపంలో సిఐటియు పతాకాన్ని యూనియన్ అధ్యక్షులు పెంజర్తి కోటి నాగులు పతాకాన్ని ఆవిష్కరించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ కరిముల్లా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ రాజారావు, జి ఏసు పాదంగి. పి.నాగరాజు, డి.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు. **గన్నవరం :** బాపులపాడు మండలం సిఐటియు కార్యాలయంలో సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పతాకావిష్కరణ జరిగింది. సిఐటియు మండల కార్యదర్శి నల్లి ఆంజనేయులు జెండాను ఆవిష్కరించారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రాజనాల సురేష్, టౌన్ అధ్యక్షులు వడ్డీ గిరిధర్, మండల అధ్యక్షులు నోచర్ల నాగేశ్వరావు, చింత సూరిబాబు, ప్రయివేట్ ఎలక్ట్రికల్ యూనియన్ కార్యదర్శి ఎం.రామకృష్ణ, సిఐటియు మండల అధ్యక్షులు బేతా శ్రీనివాసరావు, సిమెంటు, బజారు ఇసుక ముఠా కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అమరవీరుల ఆశయాలను సాధిస్తామని ప్రతిజ్ఞచేశారు. బంటుమిల్లి : సిఐటియు ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా బంటుమిల్లిలో జరిగిన కార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లానాయకుడు నాగరాజు మాట్లాడారు. సిఐటియు మండల కార్యదర్శి మాజేటి శివశ్రీనివాసరావు, వంగలరాజు, ధనశ్రీ, మరియమ్మ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


బాపులపాడులో


నాగాయలంకలో


గుడివాడలో


బంటుమిల్లిలో

ఎన్‌టిఆర్‌కు నివాళి

గుడివాడ : తెలుగు సినీ ఆకాశంలో రారాజుగా వెల్గొందిన నందమూరి తారకరామరావు శత జయంతిని పురస్కరించుకుని ఘంటసాల స్మారక సంగీత కళాపీఠ సంఘం అధ్యక్ష కార్యదర్శులు పసుపులేటి శ్రీనివాసరావు, కంచనపల్లి సుబ్రహ్మణంల అధ్వర్యంలో ఎన్‌టిఆర్ శత సిని గానామృతాన్ని ప్రజలకు వినిపించారు. స్థానిక ఎన్‌జివో హోమ్‌లో ఘంటసాల స్మారక సంగీత కళాపీఠ సంఘం అధ్వర్యంలో గాయానీ, గాయాకులు ఎం. మహలక్ష్మీ, ఎ.వి రమేష్, బి.జ్యోతిర్మయి, ఎస్. శ్రీనివాస్, ఎం.సత్యనారాయణ, ఎం.శ్రీనివాసరావు, డి.ఆనందరావు, ఎ.వెంకటరావులు అలపించిన ఎన్‌టిఆర్ పాటలు పలువురిని అకర్షించాయి.

చెత్త నుండి సంపద సృష్టి

ఉంగుటూరు : మిషన్ లైఫ్ ప్రచారంలో భాగంగా మంగళవారం ఉంగుటూరు మండలం వెల్దిపాడులో ఎంపిడిఒ జివిఎస్‌వి శేషగిరిరావు పాల్గొని ఎస్‌డబ్ల్యుపిసి షెడ్ (ఘన వ్యర్థాల నుండి సంపద సృష్టి కేంద్రం)ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్‌తో గ్రామంలో తడి పొడి చెత్తలు ప్రతి రోజూ సేకరించి వాటి ద్వారా వర్మీ కంపోస్ట్ తయారు చేయటం, దానిని విక్రయించటం ద్వారా ఆదాయం సమకూరుతుందన్నారు. గ్రామంలో ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి కలిగే నష్టాలుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇ.ఓ (పిఆర్ అండ్ ఆర్‌డి) ఎం.అమీర్ బాష, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ప్రజా ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

20 ఏళ్లలో కొడాలి ఏం చేశారు? : రావి

గుడివాడ : గుడివాడలో తానే మొనగాడిననీ, ప్రజలను మోసం చేయడం తనకు తెలిసినంత ఎవరికీ తెలియదని చేప్పే కొడాలి నాని ఆయన తన 20 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉండి గుడివాడకు ఏమీ చేయలేక పోయారని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలో కురిసిన వర్షానికి సత్యనారాయణపురం, కాకర్లవీధి, బస్టాండులో మొకాలు లోతు నీరు నిలిచింది. రావి వెంకటేశ్వరరావు ఆయా ప్రాంతాల్లో పర్యటించి గుడివాడ అభివృద్ధి ఇదేనా అంటూ ఎమ్మెల్యే కొడాలి నానిని పశ్నించారు. కొడాలి నానికి త్వరలోనే గుడివాడ ప్రజలు బుద్ధిచెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పంద్రాజు సాంబశివరావు, పెద్దు వీరబద్రరావు, పట్టపు చిన్న, తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షులు గోవాడ శివ, జిల్లా యాదవ సాధికారిక అధ్యక్షులు నెరుసు కాశి, కొలవెను గోపాలకృష్ణ, నున్న పృథ్వి, రఫీ, లోయ విజయ్, దేవేంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

సిఎం పర్యటనకు ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-గుడివాడ

త్వరలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గుడివాడ పర్యటనకు రానున్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కృష్ణాజిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. త్వరలో గుడివాడ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి పర్యటించనున్న నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లపై మంగళవారం మధ్యాహ్నం ఆయన గుడివాడ మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో పలు శాఖల జిల్లా అధికారులతో సమావేశమై శాఖల వారీగా చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లపై సమీక్షించి పలు సూచనలు, ఆదేశాలు జారీచేశారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఫోటో గ్యాలరీ ఏర్పాటు చేయాలని టిడ్కో శాఖ తగిన ఫొటోలతో సమర్థవంతంగా ఛాయాచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. రవాణా శాఖ, ఆర్టీసీ సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణ సౌకర్యం కల్పించాలని డిటిఓ సీతాపతికి కలెక్టర్ సూచించారు. గుడివాడ టౌన్‌లో శానిటేషన్ సక్రమంగా ఉండాలని, ముఖ్యమంత్రి రాక సందర్భంగా పట్టణమంతా పరిశుభ్రంగా ఉండాలని పారిశుద్ధ్య నిర్వహణ విషయంలో ఎలాంటి అశ్రద్ధ వహించరాదని గుడివాడ మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్‌కు సూచించారు. వైద్య శిబిరాన్ని అంబులెన్స్ సదుపాయాన్ని ముఖ్యమైన ప్రదేశాల్లో కల్పించాలని డిఎంహెచ్ ఓ డాక్టర్ గీతాబాయికి తెలిపారు. ముఖ్యమంత్రి సభకు తరలివచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజాబాబు ఆదేశించారు. తొలుత ముఖ్యమంత్రి ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, మాజీ మంత్రులు, మచిలీపట్నం, గుడివాడ శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య (నాని) , కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని), కలెక్టర్ పి.రాజాబాబు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మల్లాయపాలెంలోని టిడ్కో ప్లాట్ల వద్ద బహిరంగసభ ప్రదేశాన్ని సందర్శించారు. ముఖ్యమంత్రి సభా వేదికకు ఏ మేరకు అనుకూలంగా ఉందోనని పరిశీలించి అధికారులకు తగు సూచనలు, ఆదేశాలిచ్చారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, జిల్లా ఎస్పీ పి. జాషువా, టిడ్కో ప్రాజెక్ట్ ఆఫీసర్ బి. చిన్నోడు, గుడివాడ ఆర్‌డిఒలు పద్మావతి, గుడివాడ మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ డిఆర్‌డిఎ పిడి, పి ఎస్ ఆర్ ప్రసాద్, హౌసింగ్ పిడి జీ.వి సూర్య నారాయణ తదితర అధికారులు పాల్గొన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ పి.రాజాబాబు, రఘురాం, కొడాలి నాని తదితరులు

ఎస్ఇబి జెడిగా శ్రీహరి బాబు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

కృష్ణాజిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్), స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టరుగా ఆర్.శ్రీహరి బాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ పి.జాషువాను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీస్ శాఖను మరింత బలోపేతం చేసే విధంగా విధులు నిర్వహిస్తూ జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చే విధంగా కృషి చేయాలన్నారు. 2012 బ్యాచ్ గ్రూప్-1 ఎగ్జామినేషనులో డిఎస్పీగా ఎంపికయ్యారు. వివిధ జిల్లాలలో డిఎస్పీగా విధులు నిర్వహించి, మంగళగిరి పిసిఎస్ విభాగం నుండి అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొంది, సాధారణ బదిలీలో భాగంగా అడిషనల్ ఎస్పీ అడ్మిన్, స్పెషల్ ఎంఫోర్స్మెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టరుగా బాధ్యతలు స్వీకరించారు.



బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

ప్రజాశక్తి-పెదపారుపూడి

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాల విద్యా కమిషనర్, జిల్లా విద్యాశాఖ అధికారి వారి ఆదేశాల ప్రకారం యలమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్రోల్మెంట్ డ్రైవ్ చేపట్టారు. 3 నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులను చేర్పించడానికి యలమర్రు పాఠశాల పరిధిలోని చిన్న పారుపూడి, ఈదుల మద్దాల, చిపూడి, కాచిపూడి, జువ్వనపూడి, యలమర్రు గ్రామాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు, ఆయా గ్రామాలలోని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వం అందించే పథకాలను వివరిస్తూ బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించడానికి కషి చేస్తున్నట్లు ఉపాధ్యాయులు మంగళవారం తెలిపారు. బడుబయట ఉనన వారిని గుర్తించి తిరిగి చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రావెళ్ల వరుణ కుమార్, ఉపాధ్యాయులు పి.సత్యనారాయణ, వి.సాంబశివరావు, పి.అంబేద్కర్, వి.పద్మావతి, ఎస్.కరుణ కుమార్, సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.మోహనరావు, చంద్రశేఖర్‌రెడ్డి, లింగరాజు, సిఆర్‌పి కె.కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొరియర్ శ్రీను అక్రమ అరెస్ట్ దారుణం : కాగిత

ప్రజాశక్తి-పెడన

జనసేన నాయకుడు, మచిలీపట్నం వాస్తవ్యులు కొరియర్ శ్రీను అక్రమ అరెస్టును పెడన నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి కాగిత కృష్ణప్రసాద్ తీవ్రంగా కండించారు. బంటుమిల్లి పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చిన విషయం తెలుసుకున్న ఆయన జనసేన పార్టీకి మద్దతుగా పోలీస్ స్టేషన్ దగ్గర సిఐతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం బ్యానర్ల పిచ్చి ప్రభుత్వంగా తయారైందని కాగిత విమర్శించారు. అల్లర్లు సృష్టించేదే వైసీపీ ప్రభుత్వం అయితే ఇతర పార్టీల వారిని అరెస్టు చేయడం వారికి అలవాటై పోయిందన్నారు. ఇప్పటికైనా ఈ పోలీసు వారు నిజానిజాలు తెలుసుకుని కొరియర్ శ్రీనును విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బందరు జనసేన ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ, పెడన నియోజవర్గ జనసేన నాయకులు బాబు, యడ్లపల్లి రామ సుధీర్, సీనియర్ జనసేన నాయకులు రాంప్రసాద్, బంటుమిల్లి మండలం టిడిపి అధ్యక్షులు వీరబాబు తదితరులు పాల్గొన్నారు. **మచిలీపట్నం రూరల్ :** ఫ్లెక్సీల పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పరంగా అధికారులతో వివాదాస్పదమైన ఫ్లెక్సీ లు ఏర్పాటు చేయడాన్ని జిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి లంకిశెట్టి బాలాజీ, మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జి బండి రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. కొరియర్ శ్రీ నును తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సుబ్బారావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-చల్లపల్లి

మండలం పరిధిలోని లక్ష్మీపురం పంచాయతీ శివారు చింతలమడ గ్రామానికి చెందిన శీరం (76)సుబ్బారావు మంగళవారం ఉదయం అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చనిపోయారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన భార్య గతంలో మరణించారు. వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు, లక్ష్మీపురం పిఏసీఎస్ చైర్పర్సన్ శీరం వెంకట సత్యనారాయణ (నాని) ఈయనకు రెండవ కుమారుడు. ఆయన పార్థివ దేహాన్ని చల్లపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కళ్యాణి, వైసిపి రాష్ట్ర నాయకులు, హ్యూమన్ రైట్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఎపి చైర్మన్ రాజులపాటి శివప్రసాద్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఆరోగ్యానికి పొగాకు హానికరం

- రమేష్ హాస్పటల్స్ పల్మనాలజిస్టు డాక్టర్ బాలకృష్ణ
- నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం


డాక్టర్ బాలకృష్ణ

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ
ప్రపంచ వ్యాప్తంగా పొగాకు వినియోగాన్ని తగ్గించడానికి లేదా ఆపడానికి ప్రతి సంవత్సరం మే 31వ తేదీన ' వరల్డ్ నో టొబాకో డే ' జరుపుకుంటారు. పొగాకు ఆరోగ్యానికి ఎంత ప్రమాదకరమో తెలిసినా ప్రజలు దానిని వినియోగించడం మానుకోవడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో ఆరోగ్యంపై దాని దుష్ప్రభావాల గురించి అవగాహన పెంచడానికి, ప్రపంచ వ్యాప్తంగా పొగాకు వినియోగాన్ని తగ్గించడానికి లేదా ఆపడానికి ప్రతి సంవత్సరం మే 21న టొబాకో డే జరుపకుంటారు. పొగాకు దానిని పండించే, తినే వారి ఆరోగ్యాన్ని ప్రభావితం చేయడమే కాకుండా పర్యావరణానికి కూడా చాలా హానికరం. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నగరంలోని డాక్టర్ రమేష్ హాస్పటల్స్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్టు డాకర్టర్ బాల కృష్ణ ప్రజాశక్తితో మాట్లాడారు. ధూమపానం చేసి నెమ్మదిగా మిమ్మల్ని మీరు చంపుకుంటున్నందున మానేయాలనుకుంటున్నారా.. దూమపానం ఆరోగ్యానికి హానికరం మన రోజువారి జీవితంలో ఈసందేశాన్ని మనం తరచుగా వింటున్నాము. కాబట్టి ప్రతి ఒక్కరూ ఒక్క సెకను ఆగి మీ జీవితం గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. దూమపానం అటవాటు ఉన్నవారు తప్పకుండా మానివేయాల్సిన పరిస్థితి ఉందన్నారు.

పొగాకులో ప్రమాదరకమైన రసాయనాలు

పొగాకులో ప్రమాదకరమైన రసాయనాలు ఉంటాయని, కాబట్టి వీటి నుండి దూరంగా ఉండాల్సిన అవసరం ఎంతయినా ఉందని తెలిపారు. సిగరెట్ పొగలో హై రిస్కు కెమికల్స్ ఉంటాయన్నారు. కార్బన్ మోనాక్సైడ్, తారు, లోహాలు, రేడియోధార్మిక సమ్మేళనాలు, ఆక్సీకరణ రసాయనాలు, ఉంటాయని తెలిపారు.

ఊపిరితిత్తులపై ధూమపానం ప్రభావం

ధూమపానం ఆరోగ్యానికి హానికరమని, ఊపిరిత్తులపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఊపిరిత్తుల క్యాన్సర్, ఊపిరితిత్తుల అంటు వ్యాధులు, ఊపిరితిత్తుల కణజాల వాపు, సివోపిడి ఎంఫిసెమో, దీర్ఘకాలిక బ్రోన్కైటిస్ వంటివి పొగాకు కారణంగా వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. పొగాలకులో ఉండే హానికర రసాయనాలు రోగ నిరోధక కణాలను సరిగా పనిచేయకుండా నిరోధిస్తాయన్నారు.



ధూమపానం గుండె జబ్బులు

ధూమపానం వలన గుండె సమస్యలు కూడా వచ్చే అవకాశం ఉందన్నారు. ధూమపానం కారణంగా గుండె వ్యాధి దిగజారడం ద్వారా అథెరోస్క్లెరోసిస్ కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచడంతో పాటు అధిక రక్తపోటు, ఆరోగ్య సమస్యలు పెరుగుతాయని తెలిపారు.

ధూమపానం మానేయడం ఎలా?

పొగాకు వ్యసనాన్ని ఎదుర్కోవడానికి అనేక మార్గాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా ఆదర్శవంతమైన చర్య అలవాటు చేసుకోవడంతో పాటు సంతోషకరమైన, ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలనే కోరికను పెంపొందించుకోవాలన్నారు. ముఖ్యంగా పొగాకు వ్యసనానికి చికిత్సలు కూడా అందుబాటులో ఉన్నాయి. వాటిలో నికోటిన్ స్థాపన చికిత్సను ప్రయత్నిస్తే ఉపయోగకరంగా ఉంటుంది. దూమపానం మానేయడంలో సహాయపడటానికి నికోటినఖ లేకుండా ప్రిస్క్రిప్షన్ మందులు, ఉంటాయన్నారు. షార్ట్ యాక్టింగ్ నికోటిన్ రీప్లేస్‌మెంట్ థెరపీని ఉపయోగించడం వల్ల ప్రజలు తీవ్రమైన కొరికలను అధికమించవచ్చున్నారు. పొగ రహిత వాతావరణానికి వెళ్లడానికి ప్రయత్నించాలి. గార్డెనింగ్, జర్నలింగ్, ఆధ్యాత్మిక చింతన వంటి వాటిని అలవరచుకోవడం చేయాలన్నారు.


పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: దేశంలో ఎక్కడా లేని విధంగా కుల, మత, ప్రాంత, పార్టీలకు అతీతంగా సంక్షేమ అభివృద్ధి పథకాలను అందజేస్తున్న వైసిపి పాలనకు నాలుగేళ్ల పూర్తయిందని యువ నాయకులు సామినేని వెంకట కృష్ణప్రసాద్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని వైసిపి నియోజకవర్గ కార్యాలయంలో వైసిపి పాలనకు నాలుగేళ్ల పూర్తయిన సందర్భంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నిసా ఫిరోజ్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, పట్టణ సచివాలయాలు కన్వీనర్ తుమ్మెపల్లి నరేంద్ర, విజయవాడ దుర్గగుడి డైరెక్టర్ నంబూరి రవి, రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు, పట్టణ కౌన్సిలర్లు కొలగని రాము, గింజుపల్లి వెంకట్రామయ్య, వట్టెం మనోహర్, కాశీ కిషోర్, రహమతుల్లా, పొద్దుటూరి కష్ణమూర్తి,కాసర్ల బాలస్వామి పాల్గొన్నారు.



సబ్సిడీపై విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-తిరువూరు: మండలంలోని కొమ్మిరెడ్డిపల్లి ఆర్‌బి కెలో 50 శాతం సబ్సిడీపై రైతులకు జీలుగ విత్తనాలను వ్యవసాయ శాఖ అధికారిణి పద్మ మంగళవారం అందజేశారు. పది కిలోల ప్యాకెట్ విలువ సబ్సి డీ మినహాయించి రూ.395కే రైతుల కు ఇస్తున్నామని ఆమె తెలిపారు. కావ లసిన రైతులు ఆర్బికెలలో తీసుకోవా లని చెప్పారు. పచ్చి రొట్ట విత్తనాలను ప్రధాన పంట వేయ డానికి ముందు భూమిలో వెదజల్లి 50 శాతం పూత దశ రాగానే భూమిలో కలియ దున్నితే భూమికి కావలసిన సేంద్రియ ఎరువును కొంతవరకు అందించడమేకాక, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చని ఏవో వెల్లడించారు.




ఆర్‌టిసి బలోపేతానికి జగన్ కృషి

ప్రజాశక్తి-విజయవాడ: వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విజయవాడ ఆర్‌టిసి జోనల్ చైర్మన్ తాతినేని పద్మావతి తన ఛాంబర్‌లో మంగళవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా జిల్లా డిపిటిఒ ఎంవై దానంతో కలిసి కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ ఎపిఎస్‌ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసి, ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందించడంతో పాటు ఆర్టీసిని బలోపేతం చేసేందుకు సిఎం జగన్మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిటిడి (ఆర్‌టిసి) బిసి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ శేషగిరిరావు, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎం అబ్రహం, ఎన్‌ఎంయు జిల్లా కార్యదర్శి రామకృష్ణ, నాయకులు ముక్తేశ్వరరావు, యాకోబ్, దాస్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కార్మికులకు పే స్లిప్పులు ఇవ్వాలి

విస్సన్నపేట : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు నాగరాజు విస్సన్నపేట మండలం కొర్లమండ గ్రామంలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భ:గా ఉపాధి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీల వేతనాలు బ్యాంకులో ప్రింట్ అవుట్ ఇవ్వకపోవడం వల్ల వారినిక ఎంత కూలి వస్తుందో తెలియక, ఎంత డబ్బులు బ్యాంకులో డ్రా చేయాలో తెలియని పరిస్థితిలో ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఉపాధి కూలీలకు వారం వారం ప్లే స్లిప్పులు ఇవ్వాలని ఆయన కోరారు.



జూపూడి పంచాయతీని సందర్శించిన అధికారులు



ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: జూపూడి గ్రామ పంచాయతీలో జరిగిన అభివృద్ధి పనులుచ ఎస్‌డబ్ల్యూ పిసిషెడ్ నిర్వహణ ఆర్‌జిఎస్‌ఏ జిపిడిపి 15పైనాన్స్ స్వామిత్వ సర్వే పథకములను పరిశీలించడానికి సోమవారం అధికారుల బృందం వచ్చారు. సిబ్బందిని వారి విధులను అడిగి తెలుసుకుని వారికి తగు సూచనలు జారీ చేశారు. కేంద్ర పంచాయితీరాజ్ అడిషనల్ సెక్రటరీ డాక్టర్ చంద్రశేఖర్ కుమార్ స్పెషల్ సిఎస్ పి ఆర్ డిపార్ట్‌మెంట్ బి రాజశేఖర్ పంచాయితీ రాజ్ కమీషనర్ ఏ సూర్యకుమారి స్పెషల్ కమీషనర్ పి ఆర్‌అండ్ ఆర్‌డి భాగ్యలక్ష్మీ ఎడిషనల్ కమీషనర్ సుధాకర్ ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ పి సంపత్ కుమార్ ఎన్టీఆర్ జిల్లా సబ్‌కలెక్టర్ అతిథిసింగ్ జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి జ్యోతిబస్సు ఎన్టీఆర్ జిల్లా పంచాయితీ అధికారి జె సునీత ఇబ్రహీంపట్నం మండల పరిషత్ అభివృద్ధి అధికారి బివి రామకృష్ణనాయక్ ఇబ్రహీంపట్నం తహాశీల్దార్ ఎం సూర్యారావు జూపూడి పంచాయితీ కార్యదర్శి మునేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బడిబాట కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి-తిరువూరు
రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతుందని, దానిలో భాగంగా జగనన్న విద్యా కానుక, గురుముద్ద, నాడు నేడు వంటి ప్రతి ష్టాత్మక పథకాలను అమలు చేస్తోందని మండల విద్యాశాఖాధికారి చదల రామకృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో గానుగపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బడిబాటపై రూపొందించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు ఆదిలక్ష్మీ, ఉపాధ్యాయులు ఎం.రాంప్రదీప్, సిహెచ్.విజయలక్ష్మి, ఎం.రవి, ఎం.ప్రసన్న, సిహెచ్.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట గ్రేడ్ బి 1 గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా 23వ రోజు మంగళవారం మొదటిగా పుస్తక పఠనం చేయించారు. తదుపరి ఉపాధ్యాయుడు పర్చా లక్ష్మణరావు జాతీయ పతాకం మూడు రంగులు, అశోక్ ధర్మచక్రం, దేశభక్తి గీతాన్ని అభినయం చేస్తూ విద్యార్థులతో చేయించారు. అనంతరం విద్యార్థులకు ఉపాధ్యాయుడు, కవి దోసపాటి నాగేశ్వరావు కథలు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం అధికారి అలేటి ప్రభ, శ్యామల, సత్యవతి పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎ, ఎంఎల్‌సిలను కలిసిన సిఐ

ప్రజాశక్తి-నందిగామ: నందిగామకు నూతనంగా బదిలీపై వచ్చిన సీఐ హనీష్ సోమవారం ర4 నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్‌లను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో రాజీ లేకుండా పనిచేయాలని, ఫ్రెండ్లీ పోలీసింగ్ అనుసరించాలని కోరారు.



ఘనంగా 'సిమాట్స్' వార్షికోత్సవం

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్
సిమాట్స్ ఇంజనీరింగ్ సంస్థ వార్షిక వేడుకలు నగరంలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం ఘనంగా జరిగాయి. సవిత ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ టెక్నికల్ సైన్సెస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో విద్యార్థులతో పాటు అధ్యాపకులు కూడా పాల్గొన్నారు. ఈసందర్భంగా సంస్థ ఇన్‌ఛార్జి కె.ఎన్.కుమార్ మాట్లాడుతూ ప్రతి ఏటా విద్యార్థుల్లో మంచి ప్రతిభను పెంపొందించే విధంగా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అందులో భాగంగానే వివిధ కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు విద్యార్థుల అభివృద్ధికి ప్రతిభాన్వేషణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

అధ్యయనంతో ఆర్థికంగా బలోపేతం కావాలి

కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ నాగేశ్వరరావు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని కష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ నందు జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలో గల కేడీసీసీ బ్రాంచ్ ల పరిధిలో ఉన్న సహకార సంఘాల సిబ్బందిని స్టడీ టూర్ నిమిత్తం పెడన నియోజకవర్గంలో గల నందమూరు సహకార సంఘానికి వెళుతున్న సంఘా సిబ్బంది ఉన్న మొదటి బ్యాచ్ బస్సును కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు జండా ఊపి కార్యక్రమం ప్రారంభించారు. నందమూరు సహకార సంఘం యొక్క టర్నోవర్ 43 కోట్లు, పంట ఋణాలు, దీర్ఘకాలిక రుణాలే కాక, సంఘానికి ఫంక్షన్ హాల్, ప్యాడి పోకుర్మెంట్ మరియు పెట్రోల్ బంక్ నిర్మాణంలో కలదు. ఆ సహకార సంఘా పరిధిలో గల రైతులకు సేంద్రియ వ్యవసాయం చేసేలా ప్రోత్సహిస్తూ వారికీ సేంద్రియ పత్తి మరియు ఇతర విత్తనాలు కూడా అందచేస్తున్నారు. అలా ఆ సహకార సంఘం చేస్తున్న వివిధ రకాల వ్యాపారాలను వాటి పని తీరును గమనించి వారి వారి సంఘాలలో కూడా ఆ నూతన వ్యాపారాలు అవలంబించి సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయటం కోసమే ఈ స్టడీ టూర్‌ను కష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, అప్కోబ్ సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



ఘంటసాలలో యథేచ్ఛగా ఆక్రమణలు

ప్రజాశక్తి ఘంటసాల

ఘంటసాల గ్రామం ప్రముఖ బౌద్ధ, శైవక్షేత్రంగా



ప్రభుత్వ భవనం పక్కనే ఆక్రమణలు

విరాజిల్లుతోంది. రాష్ట్రంతోపాటు పలు జిల్లాల నుంచి శ్రీ బాలపార్వతీ సమేత జలధీశ్వరస్వామివారిని, బౌద్ధ స్థూపాన్ని, బుద్ధుని శిల్ప సంపద కలిగిన మ్యూజియం సందర్శనకు విచ్చేస్తుంటారు. ఇంత ప్రసిద్ధిగాంచిన గ్రామంలో రహదారుల ఆక్రమణలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. స్థలం కనబడితే చాలు బలాన్ని ప్రదర్శించి దర్జాగా ఆక్రమణలు చేపట్టి స్థిరంగా షాపులు ఏర్పాటు చేసుకుంటున్నారు. గ్రామంలోని ప్రధాన రహదారి వెంబడి భారీ స్థాయిలో షాపులు ఏర్పాటు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. కొందరు ప్రబుద్ధులు ఒక అడుగు ముందు కేసి ప్రభుత్వ కార్యాలయాల ముందే షాపులు నెలకొల్పేందుకు సిద్ధమవుతున్నా అధికారులు అటువైపు చూడటం లేదని పలువురు విమర్శిస్తున్నారు. సోమవారం రాత్రి ఆక్రమణదారుడు మండల పరిషత్ కార్యాలయం, రెవెన్యూ కార్యాలయం, తదితర ప్రభుత్వ కార్యాలయాలు ఎదుటే షాపు రాత్రికి రాత్రి నిర్మాణం చేశారు.

ప్రధాన రహదారి పక్కనే ఆక్రమణలు

ఆర్ అండ్ బి రహదారిని అనుకుని ఆక్రమణలు చేపట్టి కొంచెం కొంచెంగా రహదారి మీదకు వచ్చేస్తున్నారు. కార్లు, లారీలు ఇతర వాహనాలు భారీగా ప్రయాణించే ఈ ప్రధాన రహదారి వెంబడి ఇలా ఆక్రమణలు చేపట్టడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఘంటసాల పోలీస్ స్టేషన్ నుంచి సత్రం సెంటర్, మల్లంపల్లి రోడ్డు సెంటర్ వరకు ఇదే తంతు. రహదారి మొత్తాన్ని ఆక్రమణదారులకు రాసి ఇచ్చినట్లు బలాన్ని ప్రదర్శించి కొందరు, మరి కొందరు ఆర్థిక పలుకుబడిని కొనసాగిస్తూ ఆక్రమణలు చేపడుతున్నారు. అధికారులు చెప్పిన యాక్షన్ ప్లాన్ ఎప్పటికీ అమలవుతుందో

వరుస ఆక్రమణపై గతంలో అధికారులు జనవరి నెలలో స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ బి.రామానాయక్, ఎంపిడివో కె.వి.సుబ్బారావు, విద్యుత్ శాఖ ఏఈ రవికుమార్, ఆర్ అండ్ బి ఏఈ రమేష్, పంచాయతీ కార్యదర్శి జయలక్ష్మి తదితరులు కలసి చర్చించి రహదారి వెంబడి ఆక్రమణలు పెరగకుండా చర్యలు చేపట్టేలా యాక్షన్ ప్లాన్ రూపకల్పనకు చర్చించారు. మూడు నెలలలోగా యాక్షన్ ప్లాన్ రూపొందించి అన్ని శాఖల సమన్వయంతో రహదారి వెంబడి నూతన ఆక్రమణలు పెరగకుండా చర్యలు చేపట్టాలని మండల స్థాయి అధికారులు వివిధ శాఖల వారికి ఖరాఖండిగా చెప్పారు. కానీ నేడు ఈ ఆక్రమణల పరంపరం చూస్తుంటే ఈ యాక్షన్ ప్లాన్ ను అధికారులు అమలుపర్చలేరా? అంటూ ప్రజలు ప్రశ్నించారు.

నాపై మట్టి మాఫియా దాడి చేయలేదు

మచిలీపట్నం తహాశీల్దార్ సునీల్‌బాబు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

తనపై మట్టి మాఫియా దాడి చేసినట్లుగా వాట్సాఫ్ గ్రూపుల్లో వైరల్ అవుతున్న సందేశాలను మచిలీపట్నం తహాశీల్దార్ సునీల్ బాబు ఖండించారు. బందరు మండలం కరగ్రహారం గ్రామంలో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఆర్ఐ యాకూబ్, వీఆర్ఒ రాజ మోహన్‌లను అక్కడకు వెళ్లి విచారణ చేయమని పంపించామన్నారు. పొలంలో పని చేస్తున్న ఒక ట్రాక్టర్‌ని తీసుకువస్తుండగా మార్గ మధ్యలో ట్రాక్టర్ కు సంబంధించిన వాళ్లు కొంత గొడవ చేశారన్నారు. ఆర్ఐ నుండి తనకు సమాచారం రావడంతో పోలీస్ ప్రొటక్షన్ ఇవ్వాలని సిఐని కోరగా ఇద్దరు కానిస్టేబుళ్లు అక్కడకు వెళ్లి సంబంధిత ట్రాక్టర్ ని తహాశీల్దార్ కార్యాలయానికి తీసుకొచ్చారన్నారు. కొన్ని మీడియా వాట్సాప్ గ్రూపుల్లో తనపై మట్టి మాఫియా దాడి చేసిందని అవాస్తవ ప్రచారం రావటం పట్ల ఆయన తీవ్రంగా ఖండించారు.

బ్రిజ్ భూషణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-బంటుమిల్లి

మహిళా రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురిచేసిన రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ బ్రిజ్ భూషణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో బంటుమిల్లిలో మంగళవారం నిరసన కార్యక్రమం జరిగింది. ఆందోళన చేస్తున్న వారిపై కేంద్రప్రభుత్వం ఉక్కుపాదం మోపటం దారుణమని పలువురు నాయకులు తీవ్రంగా ఖండించారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద న్యాయపోరాటం చేస్తున్న తమపై ఢిల్లీ పోలీసులు దుర్భాషలాడుతూ అసభ్యంగా ప్రవర్తించారని మహిళా రెజ్లర్లు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. కేంద్రం రెజ్లర్ల డిమాండ్లు పరిష్కరించకుండా మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన కేంద్రమంత్రిని అరెస్టు చేయాలనీ, మంత్రి పదవి నుంచి తొలగించాలని శ్రామిక మహిళ కృష్ణా జిల్లా కన్వీనర్ పర్చూరి ధనశ్రీ డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు బంటుమిల్లి మండల కార్యదర్శి మాజేటి శివ శ్రీనివాసరావు, వంగల రాజు, నాగరాజు, మరియమ్మ, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పర్చూరి ధనశ్రీ

గన్నవరం సర్పంచ్ చెక్ పవర్ రద్దు

ప్రజాశక్తి-మచిలీపట్నం

గన్నవరం గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై గుడివాడ డివిజినల్ పంచాయతీ అధికారి విచారణ నిర్వహించారు. సర్పంచ్, కార్యదర్శి గ్రామ పంచాయతీ నిధులు రూ.1,32,10,849 దుర్వినియోగం చేసినట్లుగా అభియోగం వచ్చింది. పంచాయితీ రాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు సర్పంచ్ నిధులు డ్రా చేయు అధికారముపై నిషేధం విధిస్తూ డిపిఒ ఆదేశాలు జారీ చేశారు. గుడివాడ డివిజినల్ పంచాయతీ అధికారికి నిధులు డ్రా చేసే అధికారాన్ని కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనికి సంబంధించి వివరాల్లోకి వెళ్తే గుడివాడ డివిజినల్ పంచాయతీ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి ద్వారా గతంలో జారీ చేయబడిన షోకాజ్ నోటీస్‌లో చూపబడిన దుర్వినియోగ మొత్తం రూ.1,58,12,672లకు సర్పంచ్ చే సమర్పించబడిన ఆధారాలను గ్రామ పంచాయతీ రికార్డులతో పునఃపరిశీలన చేశారు. ఇంజనీరింగ్ అధికారులు నివేదిక ననుసరించి రూ.26,01,823లను ఆమోద యోగ్యమైన సొమ్ముగా నిర్ధారించి, సదరు ఆమోద యోగ్యమైన మొత్తమును దుర్వినియోగమైన మొత్తం సొమ్ములో రూ.26 వేలు మినహాయించగా మిగిలిన సొమ్ము రూ.1,32,10,849లు దుర్వినియోగమైనట్లుగా నిర్ధారించారు. పై పరిస్థితుల దృష్ట్యా గన్నవరం మండలంలోని గన్నవరం గ్రామ పంచాయతీ సర్పంచ్ సౌజన్య, గ్రామ పంచాయతీలో ఆర్థిక పరమైన లోపాలకు పాల్పడినట్లుగా అధికారులు గుర్తించారు. సర్పంచ్, గన్నవరం గ్రామ పంచాయతీ చెక్కు డ్రాయింగ్ అధికారాన్ని తొలగించారు. గన్నవరం గ్రామ పంచాయతీ సాధారణ నిధులు, 14వ ఆర్థిక సంఘం నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు డ్రా చేసే అధికారాన్ని ఈ ఉత్తర్వులు జారీ చేయబడిన తేదీ నుండి మూడు మాసముల వరకు డివిజినల్ పంచాయతీ అధికారి, గుడివాడ వారికి దఖలు పరచుచూ ఉత్తర్వులు జారీ చేశారు. గామ పంచాయతీ సర్పంచ్ నిడమర్తి సౌజన్యనకు ఈమేరకు వర్తమానాన్ని అందజేశారు. జిల్లా పంచాయతీ అధికారిచే జారీ చేయబడిన ఉత్తర్వుల ద్వారా సర్పంచ్‌కు ఆ ఉత్తర్వులు అందినప్పటి నుండి ఏడు రోజుల్లో సంబంధిత జిల్లా కలెక్టరుకు రాత పూర్వకంగా అప్పీలు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. గన్నవరం గ్రామ పంచాయతీ నుండి జారీ కాబడు అన్ని చెక్కులను డివిజినల్ పంచాయతీ అధికారి. గుడివాడ వారి సంతకంతో వచ్చునప్పుడు మాత్రమే గౌరవించవలసినదిగా ఉప ఖజానా అధికారి, గన్నవరం వారిని కోరడమైనదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



నిర్మాణంలో ఉన్న రహదారి ఇదే..

శ్మశాన రహదారికి మోక్షం

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్

శతాబ్దల కాలంగా బొమ్ములూరు కండ్రిక గ్రామంలో ఎవరైనా కాలం చేసినప్పుడు ఖననం చేయాలంటే చాలా ఇబ్బందులు ఎదురయ్యేవి. శ్మశాన వాటికకు వెళ్లటానికి రహదారి లేకపోవటంతో చాలా ఇబ్బందులు ఎదురయ్యేవి. అదే వర్షాకాలం, వ్యవసాయ సీజన్ సమయంలోనైతే ఇంకా అవస్థలు వర్ణనాతీతం. చెప్పుకోలేని పరిస్థితి. ఓ వైపు ఇద్దరు గట్టు మీద నడిస్తే మరొక వైపు ఇద్దరు పొలాల్లో బురదలో నడిచే పరిస్థితి ఉంటోంది. సర్పంచ్ విజయ భాస్కర్ ముందుడగు వేసి వార్డ్ నెంబర్ రాంబాబు,పార్టీ కన్వీనర్ రవి,నాయకులు దాసు, గ్రామస్తులు సమస్య పరిష్కారానికి పూనుకున్నారు. దారి వెంబడి వున్న పొలం తాలూకా యజమానులతో మాట్లాడి వారి ఒప్పందంపై సమస్యని పరిష్కరించారు.

శరవేగంగా గృహ నిర్మాణాలు

పెదపారుపూడి తహాశీలార్ వి.నాగభూషణం

ప్రజాశక్తి-పెదపారుపూడి

నవరత్నాలు పేదలందరికీ ఇల్లు పథకాలలో భాగంగా వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇల్లు నిర్మాణాలను త్వరిత గతిన పూర్తి చేసేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోందని పెదపారుపూడి తహాశీల్దార్ వి.నాగభూషణం చెప్పారు. ఆయన ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణాలు, రీసర్వే వంటి ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలు నిర్దేశించిన లక్ష్యాలను అధికార యంత్రాంగం ద్వారా అమలు జరిగేలా కషి చేస్తున్నామన్నారు. గృహ నిర్మాణం, రీసర్వే, వ్యవసాయం, జగనన్న పాల వెల్లు, ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణం ప్రగతి తదితర అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ పి.రాజబాబు ఆదేశాల మేరకు పెదపారుపూడి మండలంలో అన్ని గ్రామాల్లో సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో పారదర్శికంగా అమలు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పెదపారుపూడి మండలంలో గృహ నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యాన్ని సాధించడానికి కృషి చేస్తున్నామన్నారు. పెదపారుపూడి మండలంలోని 1152 మంది లబ్ధిదారులకుగాను 760 మంది గృహ నిర్మాణాలను బేస్‌మెంట్ వరకూ వచ్చాయన్నారు. 360 గృహాల నిర్మాణం పూర్తయ్యిందన్నారు. వెంట్రప్రగడ, యలమర్రు, పెదపారుపూడి, మహేశ్వరపురం, పాములపాడు శివారు దూలవానిగూడెం గ్రామాల్లోని లబ్ధిదారులు గృహ నిర్మాణాలను మరింత వేగంగా చేపట్టాలని కోరారు.



జనసేన ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-కోడూరు

కోడూరు మండల పరిధిలోని ఉల్లిపాలెం గ్రామంలో గత నాలుగు రోజుల కిందట విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సర్వస్వం కోల్పోయిన చాట్రగడ్డ రంగారావు కుటుంబాన్ని కోడూరు మండల జనసేన పార్టీ నేతలు పరామర్శించారు. సంఘటనా వివరాలను అడిగి తెలుసుకుని, బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. ఈ సందర్భంగా కోడూరు మండల జనసేన పార్టీ తరఫున రూ.8000 ఆర్థిక సహాయాన్ని ఆ కుటుంబానికి అందించారు. జనసేన పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కోడూరు మండల జనసేన పార్టీ అధ్యక్షులు మర్రే గంగయ్య మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల నుండి కూడా జనసేన పార్టీ కోడూరు మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు వినతి పత్రాలు ఇచ్చిన, ధర్నాలు చేసిన అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం సంభవించినప్పుడు దగ్గరలో అగ్నిమాపక కేంద్రం ఉంటే త్వరితగతిన చేరుకుని ప్రమాద తీవ్రతను తగ్గించొచ్చునన్నారు. రంగారావు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానిక తహాశీల్దార్ ఎస్కే లతీఫ్ పాషాకు చరవాణి ద్వారా మర్రే గంగయ్య విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి కొండవీటి సునీత, మండల పార్టీ ఉపాధ్యక్షులు తోట సోమశేఖర రావు, ప్రధాన కార్యదర్శి యర్రంశెట్టి దామోదర్ రావు,కార్యదర్శి బడే రాజశేఖర్, జనసేన పార్టీ నేతలు పూషడప్ప భాను, బడే లక్ష్మణ, కూనపరెడ్డి శివ నాగ రాజు , అడపా రంగబాబు ,కడవకొల్లు కోటయ్య, బడే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న జనసేన నాయకులు



జగ్గయ్యపేటలో కోలాటంతో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

కాలుష్యంపై కోలాట ప్రదర్శనతో నిరసన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగ్గయ్యపేట మండలం షేర్ మహమ్మద్ పేట గ్రామ సమీపంలోని గ్రీన్‌టెక్ ఫ్యాక్టరీ, ఆటో నగర్‌లోని ఫార్మా పరిశ్రమలను తరలించి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరుతూ మంగళవారం సిపిఎం ఆధ్వర్యాన చిన్నారులు కోలాట ప్రదర్శన ద్వారా నిరసన తెలిపారు. పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్, పట్టణ పుర వీధుల్లో తిరుగుతూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయా పరిశ్రమను తరలించాలని కోరుతూ పట్టణంలోని తహశీల్దారు కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.సిహెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ జగ్గయ్యపేట ప్రాంత ప్రజలు ఎక్కువగా కిడ్నీ, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని చెప్పారు. గతంలో గ్రీన్‌టెక్ ఫ్యాక్టరీ నుండి వెలువడిన వాయువులతో సమీపంలోని జడ్‌పి పాఠశాల విద్యార్థులు ఐదుగురు అస్వస్థతకు గురయ్యారని, పశువులు సైతం నీటిని తాగి అస్వస్థతకు గురయ్యాయని గుర్తుచేశారు. తెలంగాణలో నిషేధించిన పలు ఫ్యాక్టరీలను ఇక్కడ కనీస అనుమతులు కూడా లేకుండా ఏర్పాటు చేస్తున్నారని, దీంతో ఈ ప్రాంతంలోని భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని తెలిపారు. ప్రజల నివాసాలకు దూరంగా ఉండాల్సిన ఫ్యాక్టరీలను జనావాసాల ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల, పట్టణ కార్యదర్శి సోమోజు నాగమణి, నాయకులు కాకనబోయిన లింగారావు, కోటా కష్ణ, దంతాల వెంకటేశ్వర్లు, కోట రవికుమార్, షేక్ గౌస్‌మియా, ఎస్.రామనాథం, రావెళ్ల శేషు, దంతాల రాజేశ్వరి, కాకనబోయిన వెంకటేశ్వర్లు, షేక్ బడే మీయా, ఎల్లకమ్మ, చల్లా శ్రీను, కోలాట శిక్షకులు హరి, మల్లయ్య, పెద్ద సంఖ్యలో చిన్నారులు పాల్గొన్నారు.

మిషన్ కృష్ణాపై సమీక్ష

ప్రజాశక్తి - విజయవాడ : మిషన్ క్లీన్ కష్ణా, గోదావరి కాల్వల (ఎంసికెజిసి)లో భాగంగా నగరంలోని మూడు కాల్వల ప్రక్షాళన పనులను నగరపాలక సంస్థ ప్రారంభించింది. విఎంసిలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కెవి.సత్యవతి పన్నుల్లో పురోగతిపై ఇంజినీరింగ్, హార్టికల్చర్, శానిటేషన్ విభాగాల అధికారులతో సమీక్షించారు. కాల్వల ప్రక్షాళనకు మూడు కాల్వలకు ముగ్గురు ఎఎంఒహెచ్ అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమించారు. ఒక్కో కాల్వను శుభ్రపరిచేందుకు 200 మంది పారిశుధ్య కార్మికులను కేటాయించారు. అనంతరం ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాల పురోగతికి, అవగాహనకు, యూజర్ ఛార్జీల వసూళ్లను మెరుగుపరచటానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు.

దోపిడీ వ్యవస్థ అంతానికి ఐక్య ఉద్యమాలు : గఫూర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో : వర్గ పోరాటాల ద్వారా దోపిడీ వ్యవస్థను అంతం చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ గఫూర్ పిలుపునిచ్చారు. యావత్ కార్మిక వర్గాన్ని ఐక్యం చేసేందుకు కృషి చేయాలన్నారు. సిఐటియు 54వ ఆవిర్భావ సభ విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈసందర్భంగా గఫూర్ సిఐటియు పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగాన్ని కాపాడుకునేందుకు, సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా యూనియన్ అనేక పోరాటాలు నిర్వహించిందని వివరించారు. ఎటువంటి హక్కులు లేకుండా ఉన్న అసంఘటిత రంగ కార్మికులు, స్కీం వర్కర్లను ఐక్యంచేసి పోరాడిన ఫలితంగా కొన్ని హక్కులు, చట్టాలు సాధించుకున్నామని చెప్పారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక హక్కులను కాలరాస్తూ లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని విమర్శించారు. కార్మిక వర్గం మధ్య చిచ్చుపెట్టడానికి మత విద్వేషాలను రెచ్చగొడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గాన్ని ఐక్యం చేయడానికి ప్రతిజ్ఞ చేయాలని అన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా బిజెపి మోసం చేసిందని విమర్శించారు. కార్మిక హక్కులను కాలరాస్తూ కార్మిక కోడ్లను తీసుకొచ్చిన బిజెపి ప్రభుత్వానికి వైసిపి మద్దతు తెలిపిందన్నారు. కార్మికవర్గం నిర్వహిస్తున్న పోరాటాలపై రాష్ట్రప్రభుత్వం నిర్బంధం ప్రయోగిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె సుబ్బరావమ్మ అధ్యక్షోపన్యాసం చేస్తూ బిజెపి మతతత్వాన్ని తిప్పికొట్టి కార్మిక ఐక్యత కాపాడుకోవాలని, కార్మికుల హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. యూనియన్ నగర నాయకులు ఎం శివ వందన సమర్పణ చేసిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కెఆర్‌కె మూర్తి, ఆర్‌వి నరసింహారావు, దయా రమాదేవి, కోటేశ్వరరావు, సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పలువురికి మొబైల్ కోర్టు జరిమానా

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ నగర పాలక సంస్థ అమలు చేస్తున్న నిబంధనలను ఉల్లంఘించిన పలువురికి మొబైల్ కోర్టు న్యాయమూర్తి వి.విజయ్ కుమార్‌రెడ్డి జరిమానా విధించారు. అనంతరం కౌన్సెలింగ్ నిర్వహించారు. సర్కిల్-3 కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మొబైల్ కోర్టులో మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై శానిటరీ సూపర్వైజర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు 26 కేసులు నమోదు చేశారు. వారిని న్యాయమూర్తి ముందు హాజరుపరిచినారు. ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న, విచ్చలవిడిగా పశువులను రోడ్లపైకి వదిలివేసే , రోడ్లపై చెత్త వేసే వారికి న్యాయమూర్తి రూ.11,270 జరిమానాను విధించారు. మరోసారి ఇలా నిబంధనలకు విరుద్ధంగా చేస్తే చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం న్యాయమూర్తి వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈకార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఇక్బాల్ హుస్సేన్, శానిటరీ సూపర్వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రెటరీలు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై ఎస్‌సి రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు

ప్రజాశక్తి - విజయవాడ

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఎస్సీ రైతులకు ఉచితంగా పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ చేయనున్నామని, ఇందుకు లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అధికారులను ఆదేశించారు. ఎస్సీ రైతులకు పచ్చిరొట్ట విత్తనాల పంపిణీపై మంగళవారం ఆయన సంబంధిత అధికారులతో జూమ్‌కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ తొలకరికి ముందుగానే రైతులు నవధాన్యాల పంటలను చేపట్టి నేలతల్లి ఆరోగ్యాన్ని పెంచడం ద్వారా వ్యవసాయంలో ఆశించిన ఫలితాలను సాధించేలా రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం వ్యవసాయ రంగంలో అవసరాలకు మించి రసాయనిక ఎరువులు వినియోగించడంతో భూముల్లో సారం దెబ్బతిని చౌడు భూములుగా మారుతున్నాయన్నారు. తొలకరికి ముందుగానే నవధాన్యాల పంటలను చేపట్టి తద్వారా భూమిని సారవంతం చేసుకునేలా రైతులలో అవగాహన కల్పించాలన్నారు.

సమస్యల్లో ప్రజలు...విహార యాత్రల్లో కార్పొరేటర్లు...

మొదటి పేజీ తరువాయి

వాటిని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. ఈనెల 31 నుండి వచ్చేనెల 14 తేదీ వరకు హైదరాబాద్ నుండి గౌహతి, చిరపుంజి, షిల్లాంగ్, డార్జిలింగ్, గ్యాంగ్‌టక్, కోల్‌కతా తదితర ఆరు కార్పొరేషన్లు, పలు పర్యాటక ప్రదేశాల్లో పర్యటనకు 45 మంది కార్పొరేటర్లతోపాటు మొత్తం 55 మంది (వీరిలో కార్పొరేటర్ల భర్తలు కూడా) విజ్ఞాన యాత్ర పేరుతో విహార యాత్రకు రెండోసారి వెళుతున్నారని అన్నారు. గత ఏడాదీ 10 రోజులపాటు జమ్మూ కాశ్మీర్ నుంచి ఢిల్లీ వరకు ఉన్న పర్యాటక ప్రదేశాలు, నాలుగు కార్పొరేషన్లు పర్యటించి రూ.35 లక్షలకుపైగా ప్రజాధనం ఖర్చు చేశారని వివరించారు. ఈ పర్యటన వల్ల విఎంసికిగానీ, ప్రజలకుగానీ ఎటువంటి ఉపయోగం కలగలేదన్నారు. పర్యటన ప్రదేశాల గురించి కౌన్సిల్‌లో చర్చించిన పరిస్థితి లేదన్నారు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి పునరావృతం అవుతుందన్నారు. చెత్త పన్ను, ఆస్తి పన్ను, డ్రైనేజి, మంచినీటి పన్నుల భారాలను ప్రజలపై మోపుతూ వారిని ఆర్థికంగా కుంగదీస్తున్నారని అన్నారు. 45 శాతం వరకు ఆస్తి పన్ను పెంచారన్నారు. రూ.290 కోట్ల స్టామ్ వాటర్ డ్రైనేజి, మరో రూ.150 కోట్ల ఎపి ప్రభుత్వ గ్రాంట్లు (100+50 కోట్లు), ఎసిడిఎఫ్/ఎస్‌డిఎఫ్ నిధులు, రోడ్డు గ్రాంట్, బుడమేరు అభివృద్ధి గ్రాంట్, ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు ఇలా వివిధ రూపాల్లో రూ.500 కోట్లకుపైగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందన్నారు. ఈ నిధులను తీసుకురావడంలో అధికార వైసిపి ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు పూర్తిగా విఫలమయ్యారని పేర్కొన్నారు. ఫలితంగా నగరంలో అభివృద్ధి పనులు జరగడంలేదన్నారు. ప్రజలపై పన్నుల భారం మోపకుండా, మంచినీటి రిజర్వాయర్ల దగ్గర నుంచి ఫ్లైఓవర్లు, రహదారులు, విద్యుత్, కొండ ప్రాంతాలకు మంచినీటి సదుపాయం, ఎంబి స్టేడియం...ఇలా అనేక అభివృద్ధి పనులు కమ్యూనిస్టుల పాలనలోనే జరిగాయన్నారు. సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ నిధులు రాబట్టే దగ్గర నుంచి నగరాభివృద్ధికి తమ పార్టీ ఎప్పుడూ సహకరిస్తుం దన్నారు. కానీ విజ్ఞాన యాత్రల పేరుతో ప్రజాధనాన్ని దుర్వి నియోగం చేసే హక్కు అధికార పక్షానికి లేదన్నారు. వేసవి కాలం చివరి దశకు చేరుకుందని, మంచినీటి ఎద్దడితో శివారు కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కానీ అధికారపక్షం సమ్మర్‌యాక్షన్ ప్లాన్ అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు.

CHANGE OF NAME

I, **VISHNU PADMA BHATLA VIJAY** Spouse of **VISHNUBHATLA PADMANABHA SASTRY** resident of Door No:19-236-9076, Jabilly Enclave Appartment, Flat No: Tf-302, Sri Sai Nagar Colony, 1st Lane, Near Putta Road, Eenadu Colony, Yanamalakuduru Village, Penamaluru Mandal, Vijayawada Rural, Krishna District, Andhra Pradesh - 520007 have changed my name from **VISHNU PADMA BHATLA VIJAY** to **VISHNUBHATLA PADMA VIJAYA** vide Affidavit Dated 29-05-2023 at VIJAYAWADA, ANDHRA PRADESH.

నోటీసు

మహారాజశ్రీ దరిశి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No.83/2019

యెండ్లూరి ఐసయ్య మరియు ఇతరులు ...పిటిషనర్ / వాదులు

V/S

తన్నీరు వెంకటేశ్వర్లు మరియు ఇతరులు ... రెస్పాడెంట్లు / ప్రతివాదులు

To

R6: తన్నీరు వెంకటేశ్వర్లు

R7: తన్నీరు శ్రీను, తండ్రి: వెంకటేశ్వర్లు

R8: తన్నీరు రమేష్, తండ్రి: వెంకటేశ్వర్లు

R9: కొప్పరం లక్ష్మి, తండ్రి: వెంకటేశ్వర్లు

R10: నారాయణం సరిత, తండ్రి: వెంకటేశ్వర్లు,

All are R/o. అజిత్‌సింగ్ నగర్, విజయవాడ.

మీరు పై కోర్టువారుఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. అందువలన మీకు నోటీసు నిమిత్తం శ్రీ కోర్టువారు తేది.14-06-2023 న ఉదయం గం॥10:30ని॥ లకు, పై కోర్టులో స్వయంగా గాని లేక ఏజెంటు ద్వారా హాజరై ఎట్టి ఆక్షేపనలు ఉన్న యెడల తెలుపుకొనవలసియున్నది. లేనియెడల మీకు పరోక్షముగా తీర్మాణం కాబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది : 14-06-2023

స్థలం:దరిశి
తేది:29-05-2023

జి.టి.శివశర్మ
పిటీషనర్/వాది తరపు అడ్వకేట్,
దరిశి, ప్రకాశం జిల్లా, ఎ.పి
సెల్: 9505400327.

IN THE COURT OF THE HON□BLE IInd ADDL SENIOR CIVIL JUDGE AT VIJAYAWADA
IANo.232/2021 in IA.No.19/2019 in IP.No.56/2011

Between
Dhilipala Vijaya Lakshmi ...Petitioner/3rd Party
and
D.Satyanarayana Murthy & Others ...Respondents

ప్రతివాది(3): Subrahmani Palani Swamy S/o. V.M.Subrahmani, D.No.24-28/7-10, Beside Vijaya Nursing Training School, Rokallapalem, Vijayawada.

పై నెంబరు పిటీషనులో 3వ ప్రతివాది అయిన మీకు మీ హాజరు నిమిత్తము శ్రీ కోర్టు వారు ది.19-06-2023 కు వాయిదా వేసినారు. సదరు తేదీన ఉదయం గం॥10-30ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానము చేయబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)

వాయిదా తేది:19-06-2023
ది.30-05-2023

ఇట్లు
U.R.P.Srinivas,

పేరు మార్పు

కృష్ణా జిల్లా, గుడ్లవల్లేరు మండలం, శేరీదగ్గుమిల్లి గ్రామానికి చెందిన బొర్రా తులసీ లక్ష్మినారాయణ ప్రసాద్ తండ్రి.సుబ్బారావు(లేటు) ది.22-05-2023వ సంవత్సరంలో నేను గ్రామీణ తపాలా జీవిత భీమా పాలసీ నెం. RPLI/R-AP-VJ-EA-62081 గల పాలసీని పొందియున్నాను. పాలసీ కాలపరిమితి పూర్తి అయినది. నాకు నా తల్లితండ్రులు పెట్టిన పేరు బొర్రా తులసీ లక్ష్మినారాయణ ప్రసాద్ అయివున్నది. కానీ నా చిన్నతనము నుండి నన్ను తులసీ నారాయణ ప్రసాద్ అని వాడుకగా పిలుచుచూందురు. అందువలన నేను పైన తెల్పిన పాలసీ తీసుకొను సమయములో పొరపాటుగా నా వాడుక పేరు బొర్రా తులసి నారాయణ ప్రసాద్ అని తెలుపుట వలన పాలసీ నందు నా పేరు నమోదు కాబడినది. ఇది నా పొరపాటు అని ఒప్పుకొనుచున్నాను. నా ఆధార్ కార్డులో నా యెక్క అసలు పేరుతో పొందియున్నాను. కావున నా పాలసీలో వున్న పేరు (బొర్రా తులసి నారాయణ ప్రసాద్) నా ఆధార్ కార్డులో వున్న పేరు బొర్రా తులసీ లక్ష్మినారాయణ ప్రసాద్. రెండు విధాలుగా వున్న పేర్లు ఒకరివేనని. అవి నా పేర్లు అని తెలియజేయుచున్నాను.

CHANGE OF NAME

I, **VISHNU BHATLA PADMA NABHA SASTRY** S/o Late **VISHNUBHATLA KOTAVADHANULU** resident of Door No:19-236-9076, Jabilly Enclave Appartment, Flat No: TF-302, Sri Sai Nagar Colony, 1st Lane, Near Putta Road, Eenadu Colony, Yanamalakuduru Village, Penamaluru Mandal, Vijayawada Rural, Krishna District, Andhra Pradesh - 520007 have changed my name from **VISHNU BHATLA PADMA NABHA SASTRY** to **VISHNUBHATLA PADMANABHA SASTRY** vide Affidavit Dated 29-05-2023 at VIJAYAWADA, ANDHRA PRADESH.

ఓరిజినల్ డాక్యుమెంట్స్ పోయినవి

నా క్లయింట్ అయిన ఏక్సిస్ బాంక్యు లిమిడెడ్, విజయవాడ బ్రాంచి వారి సూచనలు మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా....
దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థి గోగినేని గోపాలకృష్ణయ్య గారి కుమారై గోగినేని రమ్య గార్కి విక్రయ దస్తావేజు నెం:3864/2012 ద్వారా మాగంటి వెంకట రామారావు గారి వద్ద నుండి గోగినేని రమ్య గారు పొంది యున్నారు.అట్టి ఆస్తికి చెందిన లింకు విక్రయదస్తావేజు నెం: 1336/2008 కంచికచర్ల సబ్‌రిజిష్టారు వారి ఆఫీసులో రిజిష్టారు కాబడిన ఓరిజనల్ డాక్యు మెంట్ పోయినదనియు అది దొరకలేదనియు నా క్లయింట్ బ్యాంకుకు అని తెలిపి సదరు అస్థిపై ఋణము కొరకు సంప్రదించగా బ్యాంకువారు ఋణము మంజూరు చేయబోవు చున్నారు. కావున ఏవరికైనా పోయిన దస్తావేజు పైగాని , మంజూరు చేయు ఋణం పై గాని, ఏవరికైనా ఎవిధమెన అభ్యంతరములు, క్లయిములు సెక్యూరిటీలు, హక్కుల వగైరాలు ఉన్నచో 7రోజుల లోపు వ్రాత పూర్వకంగా ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరనియు, గడువు లోపుల ఎటువంటి క్లయిములు తెలియజేయనిచో నిష్పేచి ఆస్థిగా భావించి లోను మంజూరు చేయబడును.గడువు అనంతరము వచ్చు అభ్యంతరాలు, ఆక్షేపణలు వగైరాలు నా క్లయింట్ హక్కులను బైండు చేయజాలవు.
షెడ్యూలు:- ఎన్.టి.ఆర్ జిల్లా, కంచికచర్ల సబ్ రిజిష్టారు ఆఫీసు, గని ఆత్కూరు గ్రామ సర్వే నెం:515/2 క్రయ విస్తీర్ణం య.4-70సెంట్లుకు హద్దులు: తూర్పు :యారమాస కోటేశ్వరరావు భూమి, దక్షిణం: డొంక, పడమర:పొన్నం లక్ష్మణరావు గారి భూమి,మరియు వగైరాలు, ఉత్తరం:గుదే అప్పారావు గారి భూమి.
ఇట్లు:- కె.వి.ఆర్ ముత్య ప్రసాద్, న్యాయవాది, విజయవాడ.ఫోన్:9885574113

మహారాజశ్రీ గుడివాడ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి.నెం.10/2023 ఇన్ ఓ.ఎస్.నెం.258/2014

బిట్వీన్:
గొరిపర్తి సత్యనారాయణ, తండ్రి.కృష్ణమూర్తి, హిందువు, వయస్సు సుమారు 58 సం॥లు, వ్యవసాయం, వెంట్రప్రగడ గ్రామం, పెదపారుపూడి మండలం, కృష్ణాజిల్లా. ...డిక్రీహూల్డర్
మరియు
రామిరెడ్డి సత్యనారాయణ, తండ్రి.జనార్ధనరావు, హిందువు, వయస్సు సుమారు 38 సం॥లు, ఉద్యోగం, పిసి 2911. వుయ్యూరు రూరల్ పోలీస్ స్టేషన్, వుయ్యూరు, కృష్ణాజిల్లా. ...జడ్జిమెంట్ డెట్టార్

పై నెంబరు గల ఇ.పి.లో జడ్జిమెంట్ డెట్టార్‌కు కోర్టు ద్వారా ఎన్నిసార్లు ఆర్డర్ 21 రూల్ 22 నోటీసులు పంపిననూ తీసుకోనందున పేపరు ప్రకటన ద్వారా నోటీసులు అమలు జరుపుటకు కోర్టువారు ఉత్తర్వులు యిచ్చియున్నందున యిందుమూలముగా తెలియజేయటమైనది. కావున ది.16-06-2023వ తేదీ ఉదయం గం॥10.30ని॥లకు పై కోర్టు వారి యెదుట జడ్జిమెంట్ డెట్టార్ స్వయముగా గానీ, మీ తరుపున న్యాయవాది గాని హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెలుపవలెను. లేని పక్షమున పరోక్షమున తీర్మానము చేయబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా:16-06-2023
గుడివాడ,
తేదీ:30-05-2023

ఇట్లు
పఠాన్ బాజీ షరీఫ్‌ఖాన్,
అడ్వకేట్,
గుడివాడ, కృష్ణాజిల్లా.

IN THE COURT OF THE HON□BLE VIIth ADDL DISTRICT JUDGE AT VIJAYAWADA
AS No.199/2010

Between
Dhilipala Vijaya Lakshmi ...Appellant
and
Kaile Sanjeeva Rao & Others ...Respondents

ప్రతివాదులు:
4)Ruthala Praveen Kumar S/o.Venkateswa Rao.
5)Ruthala Venkata Rajeswari D/o.Venkateswa Rao.
Adress: D.No.43-105-2, Block No.105, Geetha Mandiram Road, Ajit Singh Nagar, Vijayawada-520015

పై నెంబరు అప్పీలులో 4వ మరియు 5వ ప్రతివాదులు అయిన మీకు మీ హాజరు నిమిత్తము శ్రీ కోర్టు వారు ది.19-06-2023 కు వాయిదా వేసినారు. సదరు తేదీన ఉదయం గం॥10-30ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానము చేయబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)

వాయిదా తేది:19-06-2023
ది.30-05-2023

ఇట్లు
U.R.P.Srinivas,
న్యాయవాది, విజయవాడ.

అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత : సింహాద్రి

ప్రజాశక్తి-చల్లపల్లి

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నిరుపేద కుటుంబాల ఆర్థిక ప్రగతికి సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. మంగళవారం సాయంత్రం చల్లపల్లి గ్రామ సచివాలయం-4 పరిధిలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. శాసనసభ్యులు రమేష్



ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సింహాద్రి రమేష్‌బాబు

బాబు ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు వివరించారు. గడపగడపకు కార్యక్రమంలో ఎంపీటీసీ ఎన్నికలలో తమకు ఓటు వేయించలేదంటూ పాగోలు ఎంపీటీసీ సభ్యులు మేక సత్యనారాయణ (బంగారు బాబు) చల్లపల్లి కి చెందిన మైనార్టీ నాయకులు నసీం ఘోరీ ఒకరిపై ఒకరు దుర్భాషలాడుతూ దాడికి దిగారు. సంఘటన గమనించిన స్థానిక శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు ఇరువురికి సరి చెప్పి కార్యక్రమాన్ని కొనసాగిస్తున్న సమయంలో బంగారు బాబు వెనుక నుండి వచ్చి తలపై కొట్టడంతో గందరగోళం ఏర్పడింది. వెంటనే కార్యక్రమాన్ని ముగించి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో వక్కలగడ్డ, మాజేరు సర్పంచులు వల్లూరి ఉమా కల్లేపల్లి లక్ష్మీనారాయణ, మాజేరు, చల్లపల్లి పిఎసిఎస్ చైర్ పర్సన్స్ అరజా శివశంకర్, పాగోల్ ఫణి, ఎంపీటీసీ సభ్యులు మోపిదేవి ద్వారకానాథ్, వైఎస్ఆర్సిపి నాయకులు తుమ్మలవెంకటేశ్వరరావు, వెనిగళ్ళ జగదీష్ , యద్ల జగదీష్ వాలంటీర్లు, సచివాలయం సిబ్బందినాయకులు పాల్గొన్నారు

ప్రత్యేక చట్టంతో బిసిలకు ఎంతో మేలు : కొనకళ్ల

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

మహానాడు వేదికగా బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం రూపొందిస్తామని నారా చంద్ర బాబు ప్రకటించడం చరిత్రలో నిలిచిపోనుందనికి మచిలీపట్టణం మాజీ పార్లమెంట్ సభ్యులు కొనకళ్ల నారాయణ రావు పేర్కొన్నారు. స్థానిక పార్లమెంట్ పార్టీ కార్యాలయంలో బీసీ నాయకులతో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వైసీపీ ప్రభుత్వంలో బీసీలపై దౌర్జన్యలు, దాడులు, అక్రమ కేసులు పెట్టడం జరుగుతోందన్నారు. వందలాది బీసీ నేతలపై అక్రమకేసులు బనాయించడం , ఆర్థికంగా ఇబ్బదులకు గురిచేయడం, కక్ష సాధింపులకు పాల్పడుతోందన్నారు. అధికారంలోకి వచ్చిన దగ్గరనుండి నాలుగేళ్లుగా బీసీలను అణచి వెయ్యడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ల బుల్లయ్య, రాష్ట్ర సూర్యబలిజ సాధికార సంగం కన్వీనర్ రాళ్లకొట్టు రాము, మచిలీపట్టణం బీసీ అధ్యక్షులు గోకుల్ శివ, రాష్ట్ర బీసీ నాయకులూ, క్లస్టర్ ఇంచార్జి వంక వెంకటేశ్వర్ రావు, కార్యాలయ కార్యదర్శి బత్తిన దాస్, శివకోటి రాజేంద్ర ప్రసాద్, కట్ట అంజిబాబు, దిందుకుర్తి రాజు, ఆళ్ళ మాధవ, అంగర తులసి దాస్, ఈ డే భాస్కర్ రావు, మురాల రాంబాబు, కాసాని బాగ్యా రావు, దేవగానుగుల రాము, సత్యనారాయణ, పామర్తి వెంకటేశ్వరా రావు, బుల్లబ్బాయి, పార్టీ బీసీ నాయకులూ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొనకళ్ల నారాయణరావు



విద్యార్థులను అభినందిస్తున్న గన్నవరం ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి : వంశీ

ప్రజాశక్తి-గన్నవరం

చదువు జీవితాన్ని నిలబెడుతుందని గన్నవరం ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ పేర్కొన్నారు. 2022-23 విద్యా సంవత్సరంలో పదిలో ఉత్తమ ఫలితాలు సాధించిన శ్రీ చైతన్య స్కూలు విద్యార్థులను గన్నవరం నియోజక వర్గ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్ తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అభినందించారు. మండలంలో ప్రథమస్థానం సాధించిన చైతన్య స్కూల్ విద్యార్థి ఎన్.లిఖితతో పాటు అదే పాఠశాలలో ద్వితీయ, తృతీయ స్థానం సాధించిన సిహెచ్.తన్మయి, సిహెచ్ రాజ్యలక్ష్మిలు ఎంతోమంది విద్యార్థులకు ఆదర్శమన్నారు. వారి ఉన్నత చదువులకి కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా చైతన్య స్కూల్ ప్రిన్సిపల్ గాయత్రి మాట్లాడుతూ కృషి, పట్టుదల, అంకితభావం వుంటే విజయం వారి సొంతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఎస్ఐ సత్యనారాయణ, చైతన్య స్కూలు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు నగదు పంపిణీ

ప్రజాశక్తి-చల్లపల్లి

మాజేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి, చల్లపల్లి విజయ క్రాంతి జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ చదివి ఎంపీసీ గ్రూపులో 470 మార్కులకు గాను463సాధించిన అవనిగడ్డ శ్రీకష్ణప్రియ, సీఈసీ గ్రూపులో 470/463 మార్కులు సాధించిన ముదునూరి ఆశ్రితకు స్థానిక స్థానిక పిఏసిఎస్ ద్వారా ఒక్కొక్కరికి రూ.1500 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు ఒక్కొక్కరికి మరో రూ.1000 మంగళవారం అందించారు. ఈ కార్యక్రమంలో కృష్ణా, గుంటూరు జిల్లాల రైతు విభాగపు జోనల్ ఇంఛార్జి కడవకొల్లు నరసింహారావు, మాజేరు పీఏసీఎస్ చైర్మన్ అరజా శివశంకర్, సీఈఓ ఎస్.ఎస్.చక్రపాణి, వైసీపీ నాయకులు కల్లేపల్లి లక్ష్మీనారాయణ, తమ్ము మనోజ్, పర్సన్స్ మోతుకూరి నాగ మల్లేశ్వర రావు, పల్లి కోటేశ్వరరావు, విజయ క్రాంతి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ దుట్టా శివరామకృష్ణ ప్రసాద్, విద్యార్థుల తల్లదండ్రులు పాల్గొన్నారు.

'రుణాల పంపిణీలో విశాఖ బ్యాంకు ముందంజ'

ప్రజాశక్తి-గన్నవరం

దేశంలోనే ఏ సహకార బ్యాంకు అందించని రుణాలు విశాఖ బ్యాంక్ అందిస్తోందని విశాఖ



మాట్లాడుతున్న సత్యనారాయణమూర్తి

బ్యాంక్ డైరెక్టర్ జె.వి.సత్యనారాయణమూర్తి అన్నారు. మంగళవారం గన్నవరం విశాఖ బ్యాంకు సభ్యుల మహాసభ డైరెక్టర్ పివి రమణారావు అధ్యక్షతన కొత్తపేట రోటరీ క్లబ్‌లో జరిగింది. ఈ సందర్భంగా జె.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ విశాఖ సహకార బ్యాంకు సభ్యుల సంక్షేమమే ముఖ్యమన్నారు. బ్యాంకు సభ్యుల పిల్లల విద్య,,సభ్యుల వైద్య ఖర్చులు, మరణించిన ఆర్థిక సహాయం అందించటమే కాకుండా వివిధ రుణాలు తక్కువ వడ్డీకి అందిస్తోందన్నారు. డిపాజిట్లపై జాతీయ, వాణిజ్య బ్యాంకులు కన్నా అధిక వడ్డీ అందిస్తోందన్నారు. నగలుపై రుణాలు తక్షణమే అందిస్తోందన్నారు. డాక్యుమెంట్ ఛార్జీలు కూడా లేవన్నారు. రాష్ట్రంలో అన్ని బ్రాంచిల్లో లాకర్ సదుపాయం ఉందన్నారు. తమ బ్రాంచిలో ఎలాంటి నగదు నిల్వ లేకుండా సేవింగ్ ఖాతా ప్రారంభించొచ్చునన్నారు. రుణాలను సకాలంలో చెల్లిస్తే 4 శాతం వడ్డీ ద్దీ తిరిగి ఖాతాదారునికి చెల్లిస్తామన్నారు. దేశంలో షెడ్యూల్, అర్బన్ బ్యాంకులలో విశాఖ బ్యాంకు నాల్గో స్థానంలో ఉందన్నారు. రాష్ట్రంలో 46 బ్రాంచిలు, తెలంగాణలో 51 ఉన్నాయన్నారు. తొలుత ఇటీవల మరణించిన సభ్యులకు నివాళు లర్పించారు. బ్రాంచి సలహాదరులుగా. రిటైర్డ్ అధ్యాపకులు గద్దం కోటేశ్వరరావు, గన్నే వెంకట్రావు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ నర్రా సీతారామారావులను నియమించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు చిన్నం కోటేశ్వరరావు,పి.వి రమణారావు, జోనల్ మేనేజర్ సిహెచ్ వి ఆర్ సుబ్రమణ్యం, బ్రాంచి మేనేజర్ జి.పవన్ దత్త పాల్గొన్నారు.

ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలి : టిడిపి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

మచిలీపట్నం కోనేరు సెంటర్లో ప్రతిపక్షాలను హేళన చేస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తక్షణమే తొలగించాలని టిడిపి నాయకులు, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి వెంకట బాబా ప్రసాద్, పి.వి. ఫణి కుమార్ లు డిమాండ్ చేశారు. మంగళవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో బాబాప్రసాద్ మాట్లాడారు. ప్రతిపక్ష నాయకులు నగరంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే ఆగమేఘాల మీద మరుసటి రోజే నగర కార్పొరేషన్ అధికారులు తొలగిస్తున్నారని అదే అధికార పార్టీ నాయకులు పెట్టిన ఫ్లెక్సీలు నెలల తరబడి ఉంచుతూ తొలగించకపోవడం దుర్మార్గమన్నారు.

ఏపి జెఎసి అమరావతి ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకు నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని ఏపీ జేఏసీ అమరావతి కృష్ణా జిల్లా నాయకులు స్పష్టం చేశారు. ఏసీ అమరావతి ఉద్యమ కార్యాచరణలో



నినాదాలు చేస్తున్న నాయకులు

భాగంగా మూడో దశలో భాగంగా మంగళవారం కలెక్టరేట్ ధర్నా చౌక్ లో ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు వద్ద ఉద్యోగ సంఘాల నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో సాచివేత ధోరణి అవలంభిస్తోందని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకు రాష్ట్ర నాయకత్వ పిలుపులు మేరకు నిరసన పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా ఏపీ జెఏసి ఆర్టీసీ విభాగం జిల్లా కార్యదర్శి వై.వి రావు, కోఆపరేటివ్ డిపార్మెంటు నాయకులు డి. విజయ్ కుమార్, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.వి. శ్యామనాథ్,పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారంటీ

పమిడిముక్కల మాజీ ఎంపిపి రామారావు

ప్రజాశక్తి-పమిడిముక్కల



2024లో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చే లక్ష్యంతో భవిష్యత్‌కు గ్యారంటీ పేరుతో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టోపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తికరంగా చర్చ జరుగుతోందని పమిడిముక్కల మండలం హనుమంతపురం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు, పమిడిముక్కల మాజీ ఎంపిపి లింగమనేని రామారావు చెప్పారు. ఆయన ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభుత్వం తీవ్ర వైఫల్యాలను ఎదుర్కొంటోందన్నారు. మినీ మేనిఫెస్టోలో ఆరు కీలక పథకాలను వెల్లడించారన్నారు. నిరుద్యోగులకు, మహిళలకు, రైతులకు టీడీపీ పెద్దపీట వేసిందన్నారు. దీనికి తోడు తెలుగుదేశం పార్టీకి ఆది నుంచి కూడా అండగా ఉన్న బీసీలకు కూడా ఈ మ్యానిఫెస్టోలో స్థానం కల్పించారన్నారు. 3 సిలిండర్లు ఫ్రీ, మహిళలకు జిల్లాల పరిధిలో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అని ప్రకటించారన్నారు. నిరుద్యోగులకు రూ.3 వేలు నిరుద్యోగభృతి అందిస్తామని చంద్రబాబు కీలక హామీ ఇచ్చారని వివరించారు.

బుద్ధప్రసాద్ ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-చల్లపల్లి

మండల పరిధిలోని నడకుదురులోని శ్రీ పృథ్వీశ్వర క్షేత్రాన్ని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ మంగళవారం సందర్శించారు. గత ఏడాది నిర్మించిన రాజగోపురం, పాటలీవనంలో ప్రతిష్టించిన ద్వాదశ జ్యోతిర్లింగ సహిత అష్టాదశ శక్తి పీఠాల నమూనా దేవతామూర్తుల మందిరాలను దర్శించుకున్నారు. శ్రీ పద్వీశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ రాజగోపుర నిర్మాణ కర్త మండవ రవి తో ఆలయ అభివృద్ధి గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత యార్లగడ్డ శ్రీనివాసరావు, ఆధ్యాత్మిక ప్రముఖులు దీవి సారంగపాణి అయ్యంగార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

'ఉపాధి హామీ నిర్వీర్యానికి కుట్ర'

ప్రజాశక్తి-తిరువూరు: జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి సాంబారు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలంలోని జి.కొత్తూరులో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమకు కూలి తక్కువగా వస్తుందని, వారం వారం డబ్బులు కూడా రావడం లేదని, పని ప్రదేశంలో టెంట్లు లేవని కూలీలు ఆయనకు మొరపెట్టుకున్నారు. ఇబ్బందులకు గురిచేస్తే పనులకు కూలీలు రారని, అప్పుడు ఉపాధి చట్టాన్ని రద్దు చేయవచ్చునే ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం ఉందని వెంకటేశ్వర్లు విమర్శించారు.

4న జిల్లాస్థాయి అండర్-19 చెస్ పోటీలు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: కృష్ణాజిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 4వ తేదీ ఆదివారం పోరంకిలోని గ్రీన్ స్కూల్ నందు అండర్-19 చెస్ సెలక్షన్స్ కమ్ టోర్నమెంట్ జరుగుతుందని కృష్ణాజిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ యన్.యమ్.ఫణికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-19 బాల బాలికలు పాల్గొంటారని తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో ఎంపికైన మొదటి నాలుగు బాలుర క్రీడాకారులు జూన్ 8 నుండి 11వ తేదీ వరకు నంద్యాలో జరుగనున్న రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. అలాగే మొదటి నలుగురు బాలికలు విజయవాడలోనే జూన్ 15 నుండి 18వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్‌లో కృష్ణాజిల్లా జట్టు తరపున పాల్గొంటారని తెలిపారు. అలాగే అండర్-7, 9, 11, 13, 15 క్యాటగిరి విభాగాలలో కూడా పోటీలు ఉంటాయని తెలిపరు. ఈటోర్నమెంట్ ఆడాలనుకునే వారు ఎపి చెస్ డాట్ ఓఆర్‌జి ద్వారా పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. టోర్నమెంట్‌కు రిజిస్ట్రేషన్ అయిన వారు జూన్ 4వ తేదీ ఆదివారం ఉదయం 8.30 గంటల కల్లా సొంత చెస్ బోర్డు తీసుకుని రావాలన్నారు. వివరాలకు 9700775220, 9247153387 నెంబర్ల ద్వారా వివరాలను తెలుసుకోవచ్చున్నారు.

హాయర్ ప్రొ ఎయిర్ కండీషనర్ విడుదల

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: గృహోపకరణాల ఉత్పత్తులలో అగ్రగామిగా ఉన్న హాయర్ సంస్థ ఆధ్వర్యంలో అత్యాధునిక టెక్నాలజీతో 5 స్టార్ హెవీ డ్యూటీ ప్రొ ఎయిర్ కండీషనర్‌ను విడుదల చేసినట్లు సంస్థ అధ్యక్షులు ఎన్.ఎస్:.సతీష్ తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలియచేశారు. ఏసి గదిని 20 రెట్లు అధికంగా చల్లబరిచే విధంగా రూపొందించినట్లు తెలిపారు. 60 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద కూడా అద్భుతమైన కూలింగ్ ఇస్తుందన్నారు. తాము ఆవిష్కరించిన ఈబ్రాండ్ ఏడాది ఉత్తమ వినూత్న ఉత్పత్తిగా అవార్డు పొందిందని తెలిపారు. హాయర్ ఉత్పత్తుల్లో లేటెస్ట్ టెక్నాలజీతో పాటు ఎప్పటికపుడు వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా ఉత్పత్తులను మార్కెట్లోకి తీసుకువస్తున్నందుకే తమ సంస్థ అగ్రభాగాన ఉందన్నారు.

ఫైబర్ సమపాళ్లలో తీసుకోవాలి

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ: ప్రతి పది మందిలో ఏడుగురు అవసరమైన స్థాయిలో ఫైబర్ తీసుకోవడం లేదని ఆశీర్వాద్ ఆటా సంస్థ ప్రతినిధి రామ్.కె. ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీసీ సంస్థ ఆశీర్వాద్ ఆటా విత్ మల్టీ గ్రెయిన్స్ సంస్థ ఒక సర్వే నిర్వహించిందన్నారు. ఈ సర్వేలో అత్యధిక శాతం మంది తమ రోజువారీ ఆహారంలో అవసరమైనంనత మేరకు ఫైబర్ తీసుకోవడంలో విఫలమవుతున్నారని అన్నారు. ఆశీర్వాద్ ఆటా సంస్థ సుమారు 69 వేల మందికిపైగా వ్యక్తలపై సర్వే నిర్వహించినట్లు తెలిపారు. ఈ సర్వేలో ఈ విషయాన్ని తెలుసుకున్నట్లు తెలిపారు. అయితే ప్రతిఒక్కరూ ఫైబర్ సమపాళ్లలో తీసుకోవడం వలన పూర్తిస్థాయిలో ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.

కోట్లు ఖర్చు చేసినా... పూర్వ వైభవమేది?

- రాజీవ్‌గాంధీపార్కు నిర్వహణ విస్మరణ
- ఎంట్రీ టికెట్ జారీలో తీవ్రజాప్యం
- జనరేటర్ సదుపాయం లేక చీకటిమయం
- సరిపడా మరుగుదొడ్లు లేక ఇబ్బందులు



పార్కు వద్ద క్యూలైన్లలో ఉండలేక ఇబ్బంది పడుతున్న సందర్శకులు

ప్రజాశక్తి-విజయవాడ: స్థానిక రాజీవ్‌గాంధీ పార్కు ఎంట్రీ టికెట్ జారీ ఆలస్యం అవుతుండటంతో సందర్శకులు అసహనానికి గురవుతున్నారు. రైల్వే, ఆర్టీసి, సినిమా టికెట్స్‌ను ఆన్‌లైన్, క్యూఆర్ కోడ్ ద్వారా స్పీడ్‌గా ఇస్తున్నట్లుగానే ఇక్కడా కూడా ఏర్పాటు చేస్తే బాగుంటుందని సందర్శకులు అంటున్నారు. ప్రస్తుతం కంప్యూటరీకరణ ద్వారా టికెట్స్‌ను ఇస్తున్నా పెరుగుతున్న రద్దీతో ఆలస్యం అవుతుంది. శని, ఆదివారాల్లో ఐదారు వేల మంది సందర్శకులు వస్తుంటారు. మిగిలిన రోజుల్లో కూడా సందర్శకుల తాకిడి ఉంటూనే ఉంది. బాగా రద్దీగా ఉండే శని, ఆదివారాల్లో టికెట్స్ ద్వారానే లక్ష వరకు రాబడి ఉండేదని, కానీ ప్రస్తుతం అది కాస్త సగానికి సగం పడిపోయినట్లు నిర్వాహకుల నుంచి సమాచారం అందుతుంది. కోట్లాది రూపాయల విఎంసి నిధులతో ఇటీవల పార్కును అభివృద్ధి చేసినా యువతీ యువకులు, పిల్లల అందరికీ అందుబాటులో ఉండే విధంగా పాలకులు, అధికారులు చర్యలు తీసుకుంటున్న పరిస్థితి కనిపించడం లేదు. పార్కు నిర్వహణ బాధ్యత నుంచి వైదొలగి, ఎంతో కొంత రాబడి వస్తే చాలు అన్న పద్ధతిలో విఎంసి వ్యవహరిస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంట్రీ టికెట్ పెద్దలకు రూ.20, చిన్నారులకు రూ.10, ద్విచక్రవాహనం, కారు, సభలు, సమావేశాలు, ఫొటోలు, ఇతర ఫంక్షన్లకు టికెట్ ధర నిర్ణయించి భారీ మొత్తంలో వసూలు చేస్తున్నా... ఆ రీతిలో వసతులు కల్పించలేదు. టికెట్స్ ఇవ్వడానికి సరిపోయే రీతిలో సిబ్బంది లేరు. విద్యుత్ కోత ఉన్న సమయాల్లో జనరేట్ సదుపాయం లేక పార్కు చీకటిమయం అవుతుంది. ఈ సమయంలో ఏదేని జరగరాని ఘోరం జరిగితే ఎవరు బాధ్యులు అని సందర్శకులు ప్రశ్నిస్తున్నారు. పార్కుకు పెరుగుతున్న సందర్శకుల సంఖ్యకు అనుగుణంగా టాయిలెట్స్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం రెండు+రెండు చొప్పున పురుషులకు, మహిళలకు టాయ్‌లెట్స్ మాత్రమే ఉన్నాయి. పార్కులో బెంచీలు, పిల్లలు ఆడుకునేందుకు సరైన సదుపాయం ఏర్పాటు చేయలేదు. ఎప్పుడో పాడైపోయిన వాటర్ ఫౌంటైన్‌ను కూడా మరమ్మతులు చేపించే పరిస్థితి లేకుండా పోయింది. ఇప్పటికైనా ఎంట్రీ టికెట్స్ ఇచ్చే విధానాన్ని సులభతరం చేయడంతో పాటు పార్కులో ఇతర సదుపాయాలు కల్పించాలని సందర్శకులు కోరుతున్నారు.

మహిళా రెజ్లర్ల అక్రమ అరెస్టులపై నిరసన



వన్‌టౌన్‌లో నిరసన ప్రదర్శనలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఢిల్లీలో మహిళా రెజ్లర్ల అక్రమ అరెస్టులను ఖండిస్తూ ఎస్ఎఫ్ఐ, ఐద్వా, డివైఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యంలో వాగు సెంటర్ దగ్గర మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమేశ్వరరావు, ఐద్వా నగర కార్యదర్శి గాదె ఆదిలక్ష్మి, సిఐటియు నగర కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ మహిళా రెజ్లర్లు తమపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆల్ ఇండియా రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షులు, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నెల రోజులకు పైగా ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నిరవధిక ఆందోళన సాగిస్తున్నారన్నారు. బాధితులని నోరెత్తకుండా చేస్తూ నిందితుల్ని కాపాడడానికి దాడులకు, బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ నూతన పార్లమెంటు భవనం వద్దకు వెళుతున్న మహిళా రెజ్లర్లను, మద్దతుగా వస్తున్న వారిని పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారని, బలవంతంగా అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎన్.నాగేశ్వరావు, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ పి.కమల, సిపిఎం 50 డివిజన్ కార్పొరేటర్ బోయి సత్తిబాబు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-విజయవాడ: ఢిల్లీలో న్యాయం కోసం పోరాడుతున్న రెజ్లర్లకు మద్దతుగా ఐద్వా, ఎన్ఎఫ్ఐడబ్ల్యు, పిఒడబ్ల్యు, సిఐటియు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఇతర ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో విజయవాడ లెనిన్‌సెంటర్లో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ శరన్‌సింగ్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని, అతనిని ఎంపి పదవి నుంచి తొలగించాలని, రెజ్లర్లకు న్యాయం చేయాలని, రెజ్లర్ల అక్రమ అరెస్టలను ఖండించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి దుర్గాభవాని, ఐద్వా జిల్లా కార్యదర్శి కె శ్రీదేవి, పిఒడబ్ల్యు నాయకులు పి పద్మ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎమ్.సోమేశ్వరరావు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.కష్ణ, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు, నగర అధ్యక్షులు కె.దుర్గారావు ఐద్వా నాయకులు ఝాన్సీ, గాదె ఆదిలక్ష్మి, ఎన్ఎఫ్ఐడబ్ల్యు నాయకులు ఓర్సు భారతి, చైతన్య మహిళా సంఘం నాయకులు రాధా, ఏఐవైఎఫ్ నాయకులు లంకా గోవిందరాజులు, పిడిఎస్‌యు నాయకులు రాజేష్, రవిచంద్ర పాల్గొన్నారు.

వృద్ధి రేటులో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర అగ్రస్థానం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: 2023 ఆర్థిక సంవత్సరంలో లాభం, రుణ వృద్ధిలో రుణదాత జాబితాలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర అగ్రస్థానంలో నిలిచిందని బ్యాంకు ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర లాభదాయకతతో కూడిన వృద్ధిని నమోదు చేసిందన్నారు. ఈఏడాదిలో దాదాపు 126 శాతం వృద్ధితో రు. 2602 కోట్లుకు చేరుకుందన్నారు. 2022 -23 ఆర్థిక సంవత్సరంలో రుణాలు, డిపాజిట్‌ల వృద్ధిలో ప్రభుత్వ రంగత బ్యాంక్‌లలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర అగ్రస్థానంలో ఉందన్నారు. పుణే కేంద్రంగా కార్యకలాపాలను కొనసాగిస్తున్న బ్యాంకు లాభదాయకతతో అద్యధిక వృద్ధి సాధించిందని ఈసందర్భంగా ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కరెంట్ ఖాతా, పొదుపు ఖాతా, డిపాజిట్‌లను స్వీకరించడంలో బ్యాంక్ ఆఫ్ మహారాస్ట్ర 53.38 శాతంతో అగ్రస్థానంలో నిలవగా, బ్యాంక్ ఆఫ్ ఇండియా రెండవ స్థానంలనో నిలిచిందన్నారు. 2023 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి బ్యాంకు వ్యాపార వృద్ధి 21.2 శాతం పెరిగిందని తెలిపారు.

షింగిల్స్ సమస్యపై అవగాహన

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: షింగిల్స్ సమస్యపై అవగాహన పెంచేందుకు జిఎస్‌కె సంస్థ వివిధ అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తుందని జిఎస్‌కె మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రష్మి హెగ్డే ఒక ప్రకటనలో తెలిపారు. 50 సంవత్సరాల వయసు పైబడిన వారిలో ప్రతి ముగ్గురిలో ఒకరికి ప్రభావితం చేసే బాధాకరమైన పరిస్థితి షింగిల్స్ అన్నారు. షింగిల్స్ వల్ల కలిగే బాధాకరమైన నొప్పిని, దానితో బాధపడే వ్యక్తులపై అది చూపే ప్రభావాన్ని తెలియచేసేందుకుగాను వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు టీకా ద్వారా ఈసమస్యను నివారించడంతో పాటు, అవగాహన కొరకు ప్రముఖ హీరో అమితాబ్‌తో వివిధ ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా సీనియర్ సిటిజన్లపై దీని ప్రభావం ఉంటుందని, వారికి అవగాహన కల్పిస్తున్నామన్నారు.

గోవా నృత్యాలతో అలరించిన రాకేష్ విద్యార్థులు

ప్రజాశక్తి-వన్‌టౌన్ : చిట్టినగర్ కె యల్ రావు నగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు గోవా నత్యాలతో అలరించారు. మే 30న గోవా అవతరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం రాజభవన్‌లో నిర్వహించిన ప్రోగ్రామ్‌లో రెండో సారి రాకేష్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఏఎన్‌వి రావ్ ఆధ్వర్యంలో విద్యార్థులు పాల్గొని గోవా సాంప్రదాయ నత్యంను ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ సమక్షంలో చేశారు. గోవా నృత్యాలను స్వయంగా చూసిన గవర్నర్ విద్యార్థులను అభినందించారు. అనంతరం రాజభవన్ అధికార్లతో స్కూల్ విద్యార్థులు విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాకేష్ స్కూల్ టీచర్స్ రమేష్, సాధిక, అనిల్ పాల్గొన్నారు.

